



Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 138 | ఆదివారం 26 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# రైతన్నల పరిస్థితి అగమ్యగోచరం

### ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల



**అమరావతి-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** కూటమి పాలనలో రైతన్నల పరిస్థితి అగమ్య గోచరంగా తయా రైందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అకాల వర్షాలకు రాష్ట్రంలో 1.50 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఆపన్న హస్తం అందించాల్సిన కూటమి ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఆరుగాలం పడ్డ శ్రమ కళ్లముందే నీళ్లపాలవుతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. సిఎం చంద్రబాబుకు ఐటి మీదున్న శ్రద్ధ రైతాంగంపై లేదన్నారు. అన్నదాతకు భరోసా అనేది అంతా బూటకమేనన్నారు. రైతన్నలకు జరిగిన అపార నష్టంపై ఉన్నత స్థాయి సమావేశాన్ని వెంటనే జరపాలని, తక్షణమే రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.



# ఆ రైళ్లు ఏమైనాయో!

- బీహార్‌లో ‘ఛత్’.. 12 వేల ప్రత్యేక ట్రైన్‌లేవీ?
- కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శ

హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 25: బీహార్, జార్ఖండ్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు ఛట్ పండుగను బాగా జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా ఎక్కడికెక్కడికో వలస వెళ్లిన బీహార్ ప్రజలు స్వరాష్ట్రానికి చేరుకుంటారు. అయితే ప్రయాణీకులకు సరిపడనన్ని రైళ్లు లేకపోవడంతో రైల్వే స్టేషన్లలో ప్రయాణీకులు తోసుకుంటునారు. రైళ్లన్నీ కిక్కిరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైళ్ల రద్దీపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం పండుగల సందర్భంగా ప్రయాణీకుల కోసం 12 వేల ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చింది. ప్రజలకిచ్చిన ఆ హామీని నెరవేర్చరా? ఆ 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడున్నాయి అని మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ ఈ సందర్భంగా ప్రశ్నించారు.


- మిగతా 2లో..


# ఏపీకి ‘మొంథా’ ముప్పు

**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** మొంథా తుపాను దూసుకొస్తోంది.. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న సోమవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఎపిలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనీ, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సీనియర్ డ్యూటీ ఆఫీసర్ జగన్నాధ కుమార్ తెలిపారు.

**మొంథా తుపాను..**

“మొంథా”గా పిలిచే ఈ తుపాను కాకినాడ సమీపంలో 28వ తేదీ సాయంత్రం తరువాత తీరం దాటుతుందని ఎపి విపత్తుల నిర్వహణా సంస్థ తెలిపింది. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో ఇప్పటికే రెండు, మూడు రోజులుగా ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, స్థానిక వాతావరణ పరిస్థితుల వల్ల ఇలా జరుగుతుందని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.




- మిగతా 2లో..

ఈ వర్షాలు మరో నాలుగైదు రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం పశ్చిమ, వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోంది. అది తీవ్రవాయుగుండగా మారి 27న అంటే సోమవారం నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉంది. అని జగన్నాధ కుమార్ వివరించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ”తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి. మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లకూడదు. తదుపరి సూచనలు వచ్చేవరకు బోట్లను లంగరు వేసి ఉంచితే మంచిది, అని జగన్నాధకుమార్ తెలిపారు.

# అదానీ గ్రూప్‌కు ఎల్ఐసీ సొమ్ము: జైరాం రమేష్



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) 30 కోట్ల రూపాయల పాలసీదారుల పొదుపు మొత్తాన్ని అదానీ గ్రూప్‌కు ప్రయోజనం చేకూర్చడానికి మోడీ ప్రభుత్వం వాటిని ఓ క్రమపద్ధతిలో దుర్వినియోగం చేశారని శనివారం కాంగ్రెస్ ఆరోపించింది. అదానీగ్రూప్‌లో పెట్టుబడులు పెట్టమని ఆ గ్రూప్ ఎల్ఐసిని ఎందుకు అంత బలవంతం చేసిందో పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే కాంగ్రెస్ ఈ విషయంపై ఆరోపిస్తున్నప్పటికీ ఇంతవరకూ అదానీ గ్రూప్ కానీ.. కేంద్ర ప్రభుత్వంకానీ స్పందించకపోవడం గమనార్హం. దీనిపై శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేష్ మోడీ ప్రభుత్వంపై

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



# ఆస్ట్రేలియాలో లోకేష్ బిజీబిజీ

**విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** ఏపీకిపెట్టుబడులే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఆరు రోజుల కిందట ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు లోకేష్. వచ్చే నెలలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా ఆస్ట్రేలియా వెళ్లారు. గత ఆరు రోజులుగా దిగ్గజ సంస్థల ప్రతినిధులను కలిశారు. ఆపై ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ ఆంధ్రుల సహకారంతో పెట్టుబడులపై గురి పెట్టారు. ఆస్ట్రేలియాలో ల్యాండ్ అయిన మరుక్షణం అదే పనిలో పడ్డారు లోకేష్. ఆరు రోజుల పర్యటన ముగించుకొని ఈ రాత్రికి ఏపీకి బయలుదేరనున్నారు. చివరి రోజు కావడంతో లోకేష్ బిజీ బిజీగా ఉన్నారు. బ్రిటీష్ మల్టీ నేషనల్ హెల్త్ కేర్, ఇన్సూరెన్స్ సంస్థ భూప ఆసియా పసిఫిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బీజల్ సెజ్ పాల్, దినేష్ కంతేటి తదితరులతో మెల్ బోర్న్ లో సమావేశం అయ్యారు.

- మిగతా 2లో..

# ఆ రైళ్లు ఏమైనాయో!

(మొదటిపేజీ తరువాయి)

ఇది పండుగల నెల. ఈ నెలలో దీపావళి, భారు దూజ్, ఛట్ పండుగలున్నాయి. బీహార్‌లో జరుపుకునే ఈ పండుగలు విశ్వాసం కంటే ఎక్కువ. వారి మట్టి పరిమళం కోసం, కుటుంబ సభ్యుల ప్రేమ కోసం, గ్రామం కోసం బీహారీలు తమ స్వరాష్ట్రానికి వస్తారు. ఇప్పుడు వారు స్వరాష్ట్రానికి రావాలనే కోరిక.. ఒక పోరాటంగా మారింది. బీహార్‌కి వెళ్లే రైళ్లు కిక్కిరిసిపోయాయి. టిక్కెట్లు పొందడం అసాధ్యం. ఇక ప్రయాణం అమానవీయంగా మారింది. చాలా రైళ్లు వాటి సామర్థ్యానికి మించి మోసుకెళుతున్నాయి. దాదాపు 200 శాతం పైగా సామర్థ్యంతో మోసుకెళుతున్నాయి. ప్రజలు తలుపుల్ని, పైకప్పుల్ని పట్టుకుని వేలాడుతూ ప్రయాణిస్తున్నారు అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ప్రయాణికుల ఇబ్బందులపై రాహుల్ ఎన్‌డిఎ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ ప్రజలు నిస్సహాయ ప్రయాణీకులు కాదని, ఎన్‌డిఎ మోసపూరిత విధానాలకు, ఉద్దేశాలకు సజీవ సాక్ష్యమని అన్నారు. పండుగల సందర్భంగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్న 12 వేల ప్రత్యేక రైళ్లు ఎక్కడ ఉన్నాయి? ప్రతి సంవత్సరం పరిస్థితులెందుకు దిగజారిపోతున్నాయి? బీహార్ ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాంటి అవమానకరమైన పరిస్థితుల్లో ఇంటికి తిరిగి వచ్చేలా ఎందుకు నెట్టబడుతున్నారు? రాష్ట్రంలోనే ఉద్యోగం, గౌరవప్రదమైన జీవితం ఉంటే.. వారు వేల కిలోమీటర్ల దూరం తిరగాల్సిన అవసరం ఉండేది కాదు కదా. సురక్షితమై, గౌరవప్రదమైన ప్రయాణం ఒక హక్కు. అదేదో ఉపకారం కాదు అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

కాగా, ఛట్ పండుగ సందర్భంగా ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పిన ఎన్‌డిఎ ప్రభుత్వ హామీపై ఆర్‌జెడి సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ ఎన్‌డిఎ ప్రభుత్వంపై మండిపడ్డారు. అసలు దేశంలో నడుస్తున్నదే 13,198 రైళ్లు. వీటిలో ఛట్ పండగు సందర్భంగా బీహార్‌కే 12 వేల రైళ్లు నడిపిస్తామని ఎన్‌డిఎ చెప్పిన హామీ.. అబద్దపు హామీ అని లాలూ మండిపడ్డారు.

## ఏపీకి 'మొంథా' ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, పంటలను రక్షించే చర్యలు ముందుగానే తీసుకోవాలని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుపాను సమయంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. "మెరుపులతో కూడిన వర్షం, ఉరుములు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర, హోర్డింగ్‌లు ఉన్న ప్రదేశాల్లో నిలవకండి. ఎలక్ట్రానిక్ పరికరాలను ప్లగ్‌లో ఉంచకూడదు" అని అధికారులు జాగ్రత్తలు సూచించారు.

**సోషల్ మీడియా వదంతులను నమ్మకండి: హోం మంత్రి అనిత**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడనుందన్న వాతావరణ హెచ్చరికలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభావిత జిల్లాల కలెక్టర్లలతో అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం నుండి హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమీక్ష నిర్వహించారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 112, 1070, లేదా 1800-425-0101 నంబర్లకు సంప్రదించాలని చెప్పారు. సోషల్ మీడియాలో వ్యాపించే వదంతులను నమ్మకుండా, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని హోం మంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఆస్ట్రేలియాలో లోకేష్ బిజీబిజీ

(మొదటిపేజీ తరువాయి)

విశాఖలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతోపాటు దిగ్గజ ఐటీ సంస్థల పెట్టుబడుల గురించి ప్రస్తావించారు. అందుకే గ్రామీణ డిజిటల్ ఆరోగ్య సేవలో కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. దీనిపై బూపా సీఈవో బీజల్ సజ్ పాల్ సానుకూలంగా స్పందించారు. తమ సంస్థకు 190 దేశాల్లో 38 మిలియన్ల కస్టమర్లు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆరోగ్య బీమా డిజిటల్ ఆరోగ్య సేవలతో పాటు యూకే, ఆస్ట్రేలియా, స్పెయిన్ లలో వృద్ధుల సంరక్షణ కోసం కేర్ హోం లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నత స్థాయి బృందంతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తప్పకుండా విశాఖ పెట్టుబడుల సదస్సుకు హాజరవుతామని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆరు రోజులపాటు ఆస్ట్రేలియా పర్యటన విజయవంతం అయింది. ఈనెల 19న మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. గత ఐదు రోజులుగా తన పర్యటనలో దేశంలోని పారిశ్రామికవేత్తలను కలుసుకున్నారు. భారీగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. అక్కడ దిగ్గజ ఉన్నత విద్యాసంస్థలను సందర్శించారు. విద్యా బోధనతోపాటు మౌలిక వసతుల గురించి అధ్యయనం చేశారు. ఈరోజు సాయంత్రం ఆస్ట్రేలియాలో బయలుదేరి ఏపీ చేరుకోనున్నారు. మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు గల్ఫ్ దేశాల్లో మూడు రోజులపాటు పర్యటించారు. ఆయన పర్యటన విజయవంతం అయింది.

## ఏపీలో హైడ్రా తరహా సంస్థ

**గుంటూరు-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:**

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళగిరిలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుమారు రెండు గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో.. ప్రధానంగా అనధికార నిర్మాణాల కూల్చివేతలు, జలవనరుల పరిరక్షణ లక్ష్యంగా పనిచేసే 'హైడ్రా'( కార్యాచరణ, దాని విజయావకాశాలపై దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ నగర అభివృద్ధిలో హైడ్రా తీసుకున్న నిర్ణయాత్మక చర్యలు ఒకప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. హైడ్రా ఏర్పాటు అయిన తొలినాళ్లలో.. ఐపీఎస్ రంగనాథ్ నేతృత్వంలో బడాబాబుల ఫామ్‌హౌస్‌లను కూలగొట్టి, చెరువులను, కుంటలను కాపాడిన విధానానికి మంచి ప్రజాదరణ లభించింది. ఆ సమయంలోనే పవన్ కల్యాణ్ కూడా ఏపీలోనూ హైడ్రా తరహా కఠిన వ్యవస్థ ఉండాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారుఅయితే.. ఆ తర్వాత అమీన్‌పూర్‌లో జరిగిన కూల్చివేతల సందర్భంగా.. పేదల ఇళ్లపైకి వెళ్తున్నారనే ప్రచారం జరగడంతో.. హైడ్రాకు వచ్చిన సానుకూల ఇమేజ్ కాస్త ప్రతికూలమైంది. ఈ విమర్శలతో హైడ్రా తన దూకుడును తగ్గించుకుంది. ఇటీవలి కాలంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడి.. ఫెన్సింగ్ వేయడం, బతుకమ్మ కుంటకు పూర్వస్థితి తీసుకురావడం వంటి పనులు తిరిగి మంచి పేరు తెచ్చిపెట్టాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా రంగనాథ్‌ను ఆహ్వానించి మరీ ఈ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇది ఆంధ్రప్రదేశ్ నగర పాలనలో సరికొత్త సంస్కరణల ఆవశ్యకతను చెబుతోందిహైడ్రా సాధించిన లక్ష్యాలు, కార్యవిధానాలు, ఏపీలో నగర, పట్టణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి హైడ్రా పద్ధతులను ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశాలపై వారిద్దరూ సమగ్రంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అనధికార నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జా, ముఖ్యంగా తీర ప్రాంతాల్లోని జల వనరుల ఆక్రమణ వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమస్యలను నిష్పక్షపాతంగా పరిష్కరించడానికి తెలంగాణ అనుభవం ఏపీకి ఉపయోగపడుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి.హైడ్రా కేవలం కూల్చివేతలకు మాత్రమే కాకుండా.. పట్టణ మౌలిక సదుపాయాల ప్రణాళిక, మెరుగైన పర్యవేక్షణ కోసం ఏర్పడిన వ్యవస్థ కావడంతో.. విశాఖపట్నం, విజయవాడ వంటి నగరాల భవిష్యత్తు అభివృద్ధికి ఈ అనుభవాన్ని ఉపయోగించుకోవాలని పవన్ కల్యాణ్ ఆసక్తి చూపించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా హైడ్రా లాంటి వ్యవస్థ ప్రతీ రాష్ట్రంలో ఉండాలని సగటు మానవుడు కోరుకుంటారు. ఏపీలో ఇలాంటి వ్యవస్థ ఏర్పాటైతే కబ్జాలు తగ్గి.. ప్రభుత్వ స్థలాలు పూర్తిగా రక్షించబడతాయి.

# అదానీ గ్రూప్‌కు ఎల్ఐసీ సొమ్ము: జైరాం రమేష్

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా విమర్శించారు. మోదానీ జాయింట్ వెంచర్.. ఎల్ఐసిని, ఆ సంస్థలోని పాలసీదారుల పొదుపు 30 కోట్లని క్రమపద్ధతిలో ఎలా దుర్వినియోగం చేశారనే కలవరపెట్టే నిజాలను మీడియా బయటపెట్టింది అని జైరాం రమేష్ అన్నారు. మే 2025లో వివిధ అదానీ గ్రూప్ కంపెనీలలో సుమారు 33 వేల కోట్ల ఎల్ఐసి నిధులను పెట్టుబడి పెట్టమని భారత అధికారులు ఎల్ఐసికి ప్రతిపాదించారని, ఈ ప్రయత్నాన్ని అధికారులు మరింత ముందుకు తీసుకెళ్లారనే విషయాలను తాజాగా అంతర్గత పత్రాలు వెల్లడించాయని జైరాం రమేష్ అన్నారు. ఈ వ్యవహారమంతా అదానీ గ్రూప్‌పై విశ్వాసాన్ని కలిగించడం, ఇతర పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యాలని అంతర్గత నివేదికల్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. తీవ్రమైన నేరారోపణల కారణంగా నిధుల ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఒక ప్రైవేట్ కంపెనీకి బెయిల్ ఇవ్వడం తమ పని అని ఆర్థిక మంత్రిత్వశాఖ, నీతి అయోగ్ అధికారులు ఎవరి ఒత్తిడితో నిర్ణయించుకున్నారని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రమేష్ ప్రశ్నించారు. ఇది మొబైల్ ఫోన్ బ్యాంకింగ్‌కి సంబంధించిన టెక్స్‌బుక్ కేసు కాదా? అని ప్రశ్నించారు. గౌతమ్ అదానీ, అతని ఏడుగురు సహచరులపై అమెరికాలో నేరారోపణ జరిగిన తర్వాత కేవలం నాలుగు గంటల్లోనే (సెప్టెంబర్ 21 - 2024) ట్రేడింగ్‌లో ఎల్ఐసి రూ. 7,850 కోట్ల భారీ నష్టాన్ని చవిచూసింది. ప్రజాధ నాన్ని ఆశ్రిత సంస్థల్లో పెట్టుబడులు పెట్ట డం వల్ల కలిగే నష్టాలు ఏవిధంగా ఉంటాయో ఈ ఘటనే స్పష్టం చేసింది. భారత్‌లో అధిక ధరలకు సౌర విద్యుత్ కాంట్రాక్టుల ను పొందేందుకు అదానీ రెండు వేల కోట్ల లంచాన్ని అధికారులకు ఆఫర్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై మోడీ ప్రభుత్వం స్పందించలేదు. దాదాపు ఒక సంవత్సరంపాటు ప్రధానిమోడీకి అత్యంత ఇష్టమైన అదాని గ్రూప్ సంస్థకు యుఎస్ ఎస్ఇసి (కోర్టు) సమన్లు జారీ చేయడానికి మోడీ ప్రభుత్వం నిరాకరించింది అని రమేష్ విమర్శలు చేశారు. మోదానీ మెగా స్కామ్ చాలా విస్తృతమైనది. ప్రైవేట్ కంపెనీలు ఇడి, సిబిఐ, ఐటి వంటి ఏజెన్సీల ద్వారా దాడులు చేయించి.. ఆ కంపెనీల ఆస్తులను అదానీ గ్రూప్‌కు విక్రయించమని బలవంతం చేయడం వంటి ఉదాహరణలెన్నో. అదానీ గ్రూప్ ప్రయోజనం కోసమే విమానాశ్రయాలు, ఓడరేవులు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల ఆస్తులను మోసపూరితంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని రమేష్ ఆరోపించారు. వివధ దేశాలలో, భారత్ పొరుగు దేశాలలో అదానీ గ్రూప్‌కు కాంట్రాక్టులను అందించడానికి.. దౌత్య వనరులను సైతం దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఎత్తిచూపారు. షెల్ కంపెనీల మనీలాండరింగ్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి అదానీ సన్నిహిత సహచరులు నాసర్ అలీ షాబాన్ అహ్లీ, చాంగ్ - లింగ్ ద్వారా మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు బొగ్గును దిగుమతి చేసుకుని.. ఆ తర్వాత విద్యుత్ కేంద్రాల నుండి తీసుకున్న విద్యుత్‌ను అధిక ధరలకు అమ్మడం వంటి కుంభకోణాలు కూడా ఈ కోవకే వస్తాయి అని రమేష్ ప్రస్తావించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర లలో అసాధారమైన అధిక ధరలకు కారణం.. ఎన్నికలకు ముందు విద్యుత్ సరఫరా ఒప్పందాలు కుదుర్చు కోవడమేనని రమేష్ ఆరోపించారు. త్వరలో బీహార్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో అదానీ విద్యుత్ ప్లాంట్ కోసం భూమిని కేవలం ఒక్క రూపాయికే అప్పగించారని ఆయన ఆరోపించారు. మోదాని మెగా స్కామ్ మొత్తాన్ని పార్లమెంటు సంయుక్త పార్లమెంటు కమిటీ దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ గత మూడు సంవత్సరాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ సిరీస్‌పై సిరీస్ హమ్ అదానీ కే హై కౌన్ (హెచ్ఎహెచ్‌కె)తో వంద ప్రశ్నలతో కూడిన పత్రాన్ని కూడా ప్రచురించాము. మొదటగా.. ఇప్పుడు అదానీ గ్రూప్‌లో ఎల్ఐసి పెట్టుబడులు పెట్టడానికి ఎలా బలవంతం చేసిందనే దానిపై పార్లమెంటు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ దర్యాప్తు చేయాలి. ఈ వ్యవహారంపై స్వతంతంగా అధికారాల్ని ఉపయోగించి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# తాడోపేడోకు సిద్ధమైన చిన్ని

**విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:**

విజయవాడ పార్లమెంటు సభ్యుడికి, తిరువూరు నియోజకవర్గం టీడీపీ నేతకు అసలు ఎప్పుడూ వివాదాలే నడుస్తున్నాయి. గతంలోనూ విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని, అప్పటి టీడీపీ ఇన్ ఛార్జి దేవదత్ కు మధ్య పొసగలేదు. ఇప్పుడు కూడా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదం పీక్స్ కు చేరుకున్నాయి. ఇద్దరూ తొలిసారిగా చట్ట సభల్లో అడుగుపెట్టిన వారే. కొలికపూడి శ్రీనివాస్ అమరావతి ఉద్యమంలో రైతుల పక్షాన నిలబడి ఒక పథకం ప్రకారం సామాజికవర్గం నేతగా పాపులర్ అయి తిరువూరు టిక్కెట్ దక్కించుకున్నారు. అలాగే కేశినేని చిన్ని కూడాతన సోదరుడు కేశినేని నానితో విభేదించి టీడీపీలో కీలకంగా మారి విజయవాడ పార్లమెంటు స్థానాన్ని దక్కించుకున్నారు.అయితే గత కొన్నాళ్ల నుంచి తిరువూరులో ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేగా వార్ నడుస్తుంది. ఏ రేంజ్ లో అంటే వేర్వేరు కార్యక్రమాలను ఎవరికి వారే నిర్వహిస్తున్నారు. అయితే కొలికపూడి వరసగా తిరువూరులో వివాదాల్లో చిక్కుకోవడంతో పార్టీ నాయకత్వం అక్కడి బాధ్యతలను చక్కబెట్టే పనిని కేశినేని చిన్నికి అప్పగించింది. అప్పటి నుంచి కొలికపూడి శ్రీనివాస్ నియోజకవర్గంలో నామమాత్రంగానే మారారు. నామినేటెడ్ పదవుల నుంచి, పార్టీ పదవుల వరకూ కేశినేని చిన్ని చెప్పిన వారికే దక్కుతున్నాయి. ఇది కొలికపూడి శ్రీనివాస్ ఆగ్రహానికి కారణమయింది. అయితే నిన్న ఇద్దరూ వేర్వేరు కార్యక్రమాలకు తిరువూరులో నిర్వహించడంతో మరింత వివాదానికి దారితీసింది కొలికపూడి శ్రీనివాస్ ఏకంగా కేశినేని చిన్నిపై సంచలన ఆరోపణలు చేశారు. గత ఎన్నికల సమయంలో కేశినేని చిన్ని తన నుంచి ఐదు కోట్లు డిమాండ్ చేశారని, సీటు కావాలంటే కోట్లు ఇవ్వాల్సిందేనని షరతు పెట్టారని సోషల్ మీడియా వేదికగా కొలికపూడి శ్రీనివాస్ ఆరోపించారు. తాను ఐదుకోట్ల రూపాయలను దశల వారీగా చిన్నికి అందించినట్లు వాట్సాప్ లో బ్యాంక్ స్టేట్ మెంట్ ను కూడా బయటపెట్టారు. తాను ఎవరెవరెవరికి ఎంత ఇచ్చారో కూడా క్లియర్ గా కొలికపూడి శ్రీనివాస్ చెప్పడంతో వివాదం రచ్చ కెక్కినట్లయింది. తెలుగుదేశం పార్టీలో ఇది హాట్ టాపిక్ గా మారింది. గతంలోనే కొలికపూడి శ్రీనివాస్ అనేక వివాదాల్లో చిక్కుకున్నప్పుడు సాక్షాత్తూ చంద్రబాబు పిలిచి మందలించారన్న వార్తలొచ్చారు... కొలికపూడికి అంత ఆర్థికస్థోమత లేదని, కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కేశినేని చిన్ని అంటున్నారు. కొలికపూడి శ్రీనివాస్ పై మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు ఆయనపై హైకమాండ్ కు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ సంఘం ఎదుటకు కూడా కొలికపూడి శ్రీనివాస్ హాజరై వివరణ ఇచ్చారు. ఇక వివాదానికి ఫుల్ స్టాప్ పడిందనుకుంటున్న తరుణంలో తాజాగా జరిగిన రచ్చ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా తయారయింది. దీంతో పార్టీ నాయకత్వం నేడు పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని కొలికపూడి శ్రీనివాస్ ను ఆదేశించింది. అయితే చంద్రబాబు ఆదేశాలతో పల్లా శ్రీనివాసరావు పార్టీ కార్యాలయానికి రావద్దని తెలిపారు. చంద్రబాబు విదేశీ పర్యటన వచ్చిన తర్వాత ఈ పంచాయతీపై స్వయంగా చంద్రబాబు దృష్టి పెట్టనున్నారు. మొత్తం మీద తేలేదేందంటే కొలికపూడి తాడోపేడో తేల్చుకోవడానికే సిద్ధమయినట్లు కనిపిస్తుంది.

# ఈశాన్య రాష్ట్రాల్లోని బస్సులతో ప్రైవేట్ వ్యాపారం

**కర్నూలు-సూర్య వాస్తవం, అక్టోబర్ 25:**

తెలుగు రాష్ట్రాల్లో అనేక ట్రావెల్స్ బస్సులు ఎన్‌ఎల్, డిడి, పివై, ఏఆర్ నంబర్ ప్లేట్లతో తిరుగుతుండటం చాలా మంది చూసే ఉంటారు. ఆ రాష్ట్రాల బస్సులు ఇక్కడెందుకు ఉన్నాయనే డౌట్ వస్తుంది. పన్నులు ఎగ్గొట్టడానికి, కఠిన నిబంధనల నుంచి తప్పించుకోవడానికి చాలా ట్రావెల్స్ కంపెనీలు.. బస్సులను ఆయా రాష్ట్రాల్లో రిజిస్టర్ చేయిస్తున్నాయి. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తక్కువ పన్నులు, రాయితీలు ఉండటంతో అక్కడే రిజిస్ట్రేషన్ చేయించి.. మన దగ్గర తిప్పుతున్నారు. దీని వల్ల రాష్ట్రాల పన్ను ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, ఫిట్‌నెస్ లేని బస్సులతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.తెలుగు రాష్ట్రాల్లోని ట్రావెల్స్ బస్సులకు ఎక్కువగా ఇతర రాష్ట్రాల నంబర్ ప్లేట్లు ఉండటం ఎప్పుడైనా గమనించారా? ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్.. ఇలాంటి బస్సులు ఎక్కువగా ఉపయోగిస్తాయి. అంతేకాకుండా పాత బస్సులను ఇలాంటి రాష్ట్రాల్లో టూరిస్ట్ బస్సుల్లా రిజిస్టర్ చేయించి.. తెలుగు రాష్ట్రాల్లో తిప్పుతున్నారు. తాజాగా కర్నూలులో ప్రమాదానికి గురైన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సును కూడా డామన్ దయ్యూలో రిజిస్టర్ అయింది. సీటింగ్ పర్మిషన్ తీసుకుని స్లీపర్‌గా మార్చారు. రవాణా పన్నులు తప్పించుకోవడంతో పాటు పలు కారణాల వల్ల ట్రావెల్స్ కంపెనీలు ఇలా చేస్తున్నాయి.ఈశాన్య రాష్ట్రాల్లో రవాణా పన్ను మినహాయింపు ఉంటుంది. అందుకే తక్కువ పన్నులు ఉంటాయి. కేంద్రపాలిత ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో పన్నుల్లో ఇలా రాయితీలు ఇస్తారు. పర్మిట్ ఛార్జీలు కూడా తక్కువగా ఉంటాయి. ఆర్థిక కార్యకలాపాలు, వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడానికి రాయితీలను ప్రభుత్వం ఒక సాధనంగా ఉపయోగించుకుంటోంది. దాన్ని ప్రైవేటు ట్రావెల్స్ కంపెనీలు సొమ్ము చేసుకుంటాయి. అందుకే ఇలాంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తాయి. తాజాగా ప్రమాదానికి గురైన బస్సును డామన్ దయ్యూలో రిజిస్టర్ చేశారు. అక్కడ ఒక్కసీటుకు కేవలం రూ.450 పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అదే తెలుగు రాష్ట్రాల్లో రూ. 4500 చెల్లించాలి. అదే స్లీపర్ బస్సు అయితే రూ.12000 పన్ను కట్టాల్సి ఉంటుంది. అలా మొత్తంగా రిజిస్ట్రేషన్‌కు రూ. లక్షలు కట్టాల్సివస్తుంది. ట్రక్కులకు ఆల్ ఇండియా పర్మిట్ ఉన్నట్లే.. భారత్ ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ అనేది కూడా ఉంటుంది. ఆ పర్మిట్ ఉన్న వాహనాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా తిరగొచ్చు. అందుకే ట్రావెల్స్ కంపెనీలు అయా రాష్ట్రాల్లో రిజిస్టర్ చేసిన బస్సులను..

ఏపీ-తెలంగాణ, తెలంగాణ-కర్ణాటక వంటి అంతరాష్ట్ర రూట్లలో తిప్పుతాయి. నాగా లాండ్, సిక్కింలో రిజిస్టర్ అయిన కారణం గా.. తమ బస్సుకు ఆల్ ఇండియా పర్మిట్ ఉందని చూపిస్తారు.కొన్ని ట్రావెల్స్ కంపెనీలు తప్పుడు పత్రాలు సమర్పించి.. నాగాలాండ్ లేదా పుదుచ్చేరి వంటి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బస్సులను రిజిస్టర్ చేయిస్తాయి. అలాంటి ప్రాంతాల్లో ఆర్టీఓ అధికారులు కూడా కొన్ని సందర్భాల్లో కమిషన్ తీసుకుని ఇలాంటి వాటికి అనుమతిస్తారని ఆరోపణలు వస్తున్నాయి.భారత్‌లో ఆర్టీఏ నిబంధనలు వివిధ రాష్ట్రాల్లో వేరుగా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో వాహన నియంత్రణ, ఫిట్‌నెస్ చెక్, లైసెన్స్ రెన్యువల్ కఠినంగా ఉంటాయి. అందుకే ఈ రాష్ట్రాల ఆర్టీఏ నియంత్రణను తప్పించుకోవడానికి.. ఇతర రాష్ట్రాల నంబర్ ప్లేట్లు ఉన్న బస్సులు నడుపుతారు. ఇంతకుముందు ఇలాంటి కేసుల్లో జరిగిన దర్యాప్తుల్లో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాగాలాండ్ లేదా పుదుచ్చేరి వంటి రాష్ట్రాల నంబర్ ప్లేట్లతో ఉన్న బస్సులు.. ఆయా రాష్ట్రాలకు చెందిన వారిపై రిజిస్టర్ అయి ఉంటాయి. కానీ వాటి నిజమైన ఓనర్లు మాత్రం ఏపీ, తెలంగాణలో ఉండే కంపెనీలే. లీజు పేరుతో బస్సులను తిప్పుతాయి. ఇలా జరగడం వల్ల చాలా రాష్ట్రాలు పన్ను ఆదాయాన్ని కోల్పోతున్నాయి. అంతకుమించి ఫిట్‌నెస్ లేని బస్సులను నిబంధనలు పాటించకుండా నడపడం వల్ల.. అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. కొన్ని రోడ్డు ప్రమాదాల్లో బస్సు ఏ రాష్ట్రానికి చెందిందో గుర్తించడమే కష్టం అవుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

## ఇజ్రాయిల్‌కు 'సౌకర్యం'గా ఉన్న దేశాలతోనే..

జెరుసలేం: ఇజ్రాయిల్‌కు 'సౌకర్యవంతంగా' ఉన్న దేశాలతోనే గాజాలో అంతర్జాతీయ భద్రతాదళం ఏర్పాటవుతుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు. భవిష్యత్తులో గాజాలో పాలన ఎలా ఉండాలన్న అంశంపై ఇజ్రాయిల్, భాగస్వామ్య దేశాలతో కసరత్తు జరపాల్సి ఉన్నదని ఇజ్రాయిల్‌లో పర్యటిస్తున్న రుబియో శుక్రవారం తెలిపారు. ఈ విషయంలో హమాస్‌కు ఎలాంటి ప్రమేయం ఉండబోదని స్పష్టం చేశారు. పాలస్తీనా అథారిటీ పాత్రను నిర్ధారించాల్సి ఉన్నదని తెలిపారు. దక్షిణ ఇజ్రాయిల్‌లోని పౌర-సైనిక సమన్వయ కేంద్రాన్ని రుబియో సందర్శించి అమెరికా సైనిక సిబ్బందితో మాట్లాడారు. గాజాలో కాల్పుల విరమణ అమలును అమెరికా దళాలు పరిశీలిస్తున్నాయి. అక్కడ పరిస్థితులను చక్కదిద్దేందుకు అంతర్జాతీయ దళాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాయి. సుశిక్షితులైన 200 దళాలు కాల్పుల విరమణను పర్యవేక్షిస్తున్నాయని, గాజాకు సహాయ సామగ్రి చేరేందుకు సాయపడుతున్నాయని, అక్కడ భద్రతాపరమైన సాయాన్ని అందిస్తున్నాయని అమెరికా సైన్యం ప్రకటించింది. గాజాకు ఈశాన్యంగా ఉన్న కిర్యత్ గాట్ నగరంలోని ఓ బిజినెస్ పార్కు నుంచి పౌర-సైనిక సమన్వయ కేంద్రం పనిచేస్తోంది. తన సైనికులను గాజాకు పంపబోనని స్పష్టం చేసిన అమెరికా%ౌ% ఈజిప్ట్, ఇండోనేషియా, గల్ఫ్ దేశాల నుంచి దళాలను రప్పిస్తోంది. దళాలను పంపేందుకు అరబ్, ఇతర దేశాలు సంసిద్ధత తెలుపుతాయా అనేది తెలియడం లేదు. నిరాయుధీకరణకు హమాస్ ఇంకా అంగీకరించలేదు. అంతర్జాతీయ దళాల మోహరింపు సున్నితమైన అంశమని, దానిపై చర్చలు జరగాల్సి ఉన్నదని హమాస్ చెబుతోంది.

## సంపాదకీయం

# అప్పు చేసి పప్పుకూడు ?

## తెలుగు రాష్ట్రాల ప్రజల స్టైల్

తెలంగాణ?ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 11 ఏళ్లుపూర్తయింది. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఏర్పడగా, ఆంధ్రప్రదేశ్ అప్పులు, కుప్పలు లేని రాష్ట్రంగా ఏర్పడింది. ఈ రెండు రాష్ట్రాలు దేశంలో అప్పుల భారం ఎక్కువగా ఉన్న తొలి స్థానాల్లో నిలిచాయి.ఏది కావాలన్నా ముందు అప్పు చేసెయ్ అన్నట్లుగా మారిపోయింది తెలుగు రాష్ట్రాల ప్రజల లైఫ్ స్టైల్. దేశంలోనే అత్యధికంగా అప్పులు చేస్తున్న ప్రజల్లో తెలుగు రాష్ట్రాల ప్రజల ముందున్నారు. 2020-21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో ఉన్నారు. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే లో ఈ విషయం వెల్లడి అయింది. ఏపీ 1వ స్థానం, తెలంగాణ 2వ స్థానాల్లో నిలిచాయి. అయితే, ఫైనాన్షియల్ ఇన్క్లూజన్లో ఏపీ 92.3% తో రెండో స్థానంలో, కర్ణాటక 95.9% తో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలోకి చేరారు. ఈ విధంగా, దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ 14వ స్థానంలో ఉంది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే, ఓబీసీలులో 16.6% మంది అప్పుల ఊబిలో ఉంటే, గిరిజనులులో 11% మాత్రమే అప్పుల భారం తేలిందని నివేదిక పేర్కొంది. కుటుంబం పెద్దదైనా, చిన్నదైనా అప్పుల భారం వేరుగా ఉంటుంది. చిన్న కుటుంబాలు ఎక్కువ అప్పుల భారం మోస్తున్నాయి, పెద్ద కుటుంబాలపై అప్పుల ప్రభావం తక్కువగా ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో సగటున 92.1% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 31.8% మంది అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి తక్కువ, 80.2% మంది ఫైనాన్షియల్ ఇన్క్లూజన్ పరిధిలో ఉండగా, 7.4% మందికే అప్పుల భారం ఉంది. హైదరాబాద్‌ను పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ప్రకటించిన ఆంధ్రప్రదేశ్‌కు పెద్దగా ప్రయోజనం కలగలేదు. తెలంగాణ మాత్రం హైదరాబాద్ రాజధాని కారణంగా భారీగా ఆదాయం పొందుతోంది. ఇక ఏపీ రాజధాని లేని రాష్ట్రంగానే మిగిలిపోయింది. అయితే 11 ఏళ్లలో పాలకులు రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో చేసిన అప్పులతో ఇప్పుడు రెండు రాష్ట్రా?టలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇదే సమయంలో తెలుగు ప్రజలు కూడా అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక వెసులుబాటు ఉన్నా అప్పులు కూడా పెరుగుతన్నాయి. కేంద్ర గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన సర్వే ప్రకారం తెలుగు రాష్ట్రాలు దేశంలో అత్యధికంగా అప్పులు ఉన్న రాష్ట్రాలుగా మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. 2020?21 లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది అప్పుల్లో చిక్కుకున్నట్లు నివేదిక చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది.ఏపీలో 15 ఏళ్లు పూర్తి చేసిన ప్రజలలో 92.3% మంది బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నారు. ఇది కర్ణాటక (95.9%) తర్వాత రెండవ ఉత్తమ స్థాయి. అయితే కర్ణాటకలో అప్పుల శాతం కేవలం 23.2% మాత్రమే ఉంది. అంటే, బ్యాంకింగ్ చేరిక పెరగడం అప్పు భారాన్ని తగ్గించలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఇక తెలంగాణలో 86.5% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారు. దేశంలోని ప్రధాన రాష్ట్రాలలో 14వ స్థానంలో ఉంది.దక్షిణ రాష్ట్రాల సగటు ప్రకారం 92.1% మంది జనాభా బ్యాంకింగ్ వ్యవస్థలో భాగమయ్యారు. కానీ వారిలో 31.8% మంది అప్పుల బారిన పడినవారే. అంటే ఆర్థిక చేరికతోపాటు వడ్డీ ఆధారిత జీవనశైలి బలపడుతున్న సంకేతమిది. దీని విరుద్ధంగా ఈశాన్యరాష్ట్రాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. అక్కడ 80.2% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నప్పటికీ, అప్పుల శాతం కేవలం 7.4% మాత్రమే.సర్వే ప్రకారం.. బ్యాంకింగ్ చేరికలో పురుషులు (89.8%) ముందంజలో ఉండగా మహిళలు (84.5%) వెనుకబడ్డారు. మతపరంగా చూస్తే హిందువులలో 88.1% ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కలిగి ఉండగా, ముస్లింలు 80.8% వద్ద ఆగిపోయారు. ఈ వ్యత్యాసం సామాజిక ఆర్థిక అవగాహనలో, ఆదాయ అవకాశాల్లో ఉన్న అసమానతలను చూపుతోంది. అప్పుల విషయంలో ఓబీసీలు (16.6%) ప్రధానంగా బరువును మోస్తుండగా, గిరిజనులు (11%) తక్కువగా ఉన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ సేవల్ని విస్తృత పరిచాయి. యాప్స్ ద్వారా లోన్లు ఇస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ వంటి సంస్థల మార్కెట్ తెలుగు రాష్ట్రాల్లో చాలా ఎక్కువ.చాలా ఈజీగా లోన్లు ఆఫర్ చేస్తూంటారు. అందుకే ఎక్కువ మంది కట్టగలమా లేదా అన్న ఆలోచన లేకుండా అప్పులు చేస్తున్నారు. చివరికి వారిని రుణాల ఊబిలోకి దింపుతోంది. నిజానికి ఇవన్నీ బ్యాంకుల అప్పుల లెక్కలే. ప్రైవేటు అప్పుల లెక్కలు రికార్డులకు రావు. అందుకే ఈ అప్పుల కన్నా చాలా ఎక్కువగా రుణభారం ప్రజలపై ఉంటుంది. ఉత్తరాదిలో .. బ్యాంకింగ్ ఇంక్లూజన్ తక్కువ కాబట్టి అక్కడి ప్రజల అప్పులు రికార్డుల్లోకి రాలేదు. అక్కడి ప్రజలు తెలుగు రాష్ట్రాల ప్రజల కన్నా ఇంకా ఎక్కువ అప్పుల భారంలో ఉంటారని సులువుగానే అర్థం చేసుకోవచ్చు.కుటుంబ పరిమాణం ఆధారంగా చూస్తే, పెద్ద కుటుంబాల కన్నా చిన్న కుటుంబాలపై అప్పుల ఒత్తిడి ఎక్కువగా ఉంది.ఫైనాన్షియల్ ఇంక్లూజన్ వృద్ధి శుభ సూచకం అయినప్పటికీ, ఆర్థిక విద్య, పొదుపు సంస్కృతి లేకపోతే అది అప్పు భూతాన్ని తగ్గించలేదని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రభుత్వాలు, బ్యాంకులు కలిపి పొదుపు, పెట్టుబడి దిశలో అవగాహన పెంచితేనే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది. లేకుంటే తెలుగు ప్రజల అప్పులు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

# టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నో బ్యాగ్ డే

### క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించిన హెడ్మాస్టర్







**పామిడి, సూర్యవాస్తవం, అక్టోబర్ 24:** పామిడి లో టి. సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడవ శనివారం నో బ్యాగ్ శనివారం నిర్వహించడం జరిగింది. నో బ్యాగ్ డే లోభాగంగా పదవ తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం క్విజ్ నిర్వహించడం జరిగింది. విద్యార్థులు క్విజ్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సుజాత ప్రథమ స్థానం, గాయత్రి ద్వితీయ స్థానం, షహీనా తృతీయ స్థానం సాధించారు. ఓవరాల్ క్విజ్ ఛాంపియన్ గా ఏ సెక్షన్ నిలిచింది. విజేత ఏ సెక్షన్ కు విన్నర్స్ ట్రోఫీ బహుకరించడం జరిగింది. 9వ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రం చార్ట్, నమూనా ప్రిపరేషన్ చేయించడం జరిగింది. 8వ తరగతి విద్యార్థులు ప్రపంచ పటం ఇతర మ్యాపులు చిత్రించడం జరిగింది. ఏడవ తరగతి విద్యార్థులు గ్రామర్ కోర్టు ఇంగ్లీష్ భాషకు సంబంధించి నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరవ తరగతి విద్యార్థులకు పద్య పఠనం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలన్నింటిలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కే. రామ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# 9న పుట్టపర్తిలో బీజేపీ ప్రజా ఆత్మీయ సమావేశం

◆**బీజేపీ నాయకులు పోతుల సురేష్**


**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** పుట్టపర్తి జిల్లా కేంద్రంలో బీజేపీ ప్రజా ఆత్మీయ సమావేశం నవంబర్ 9 వతేదీన ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పోతుల సురేష్ పిలుపు నిచ్చారు,శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్ ఆదేశాల మేరకు పెనుగొండ నియోజకవర్గం లోని గోరంట్ల పట్టణం లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నూతనంగా భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా సమక్షంలో ఎమ్మెల్సీ పోతుల సునీత తో పాటు అదేవిధంగా పోతుల సురేష్ కండువా కప్పుకోవడం జరిగిందన్నారు, శ్రీ సత్య సాయి జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నవంబర్ 9వ తేదీన పుట్టపర్తి లో ప్రజా ఆత్మీయ సమావేశానికి అన్ని మండలాల్లో ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకులను కలిసి అందులో భాగంగా గోరంట్లలో కూడా భారతీయ జనతా పార్టీ మండల నాయకుల్ని కలసి విజయ వంతం చేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు మేదర శ్రీనివాసులు,శంకర్ రెడ్డి,నాగరాజు యాదవ్ ,గొడుగు నాగరాజు, వడల చంద్రారెడ్డి,పోతుల మనోజ్ చరణ్, చంద్ర, మహేష్, చౌడప్ప, వెంకటాచలం, హరీష్, శంకర్, లక్ష్మీనరసి, వానవోలు బాలకృష్ణ, గుంటిపల్లి చంద్ర, లక్ష్మారెడ్డి, అశోక్, అశ్వత్థ, నగేష్, కళ్యాణ్, పీవీ నరసింహులు, మహిళలు లక్ష్మీదేవి, పార్వతి బాయ్,జనసేన నాయకులు సురేష్, నరేష్, రమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌వోలతో సబ్ కలెక్టర్ సమావేశం

**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌వోలతో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి శనివారం సమావేశమయ్యారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం నందు ఓటర్ల జాబితా, పోలింగ్ బూతులపై సబ్ కలెక్టర్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలో గతంలో ఉన్న పోలింగ్ బూతులకు అదనంగా మరో 65 బూతులు కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందని, కొత్తగా ఓటర్ల జాబితా పరిశీలించి అభిప్రాయాలు వెల్లడించాలని సబ్ కలెక్టర్ కోరారు. సిపిఎం పార్టీ జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె టౌన్, రూరల్ ప్రాంతంలో నివసించే వారికి వారు నివసించే ప్రాంతంలో కాకుండా గతంలో నివసించే ప్రాంతంలో ఓట్లు ఉన్నాయని, దానిపై సమగ్ర పరిశీలన చేసి వారు నివసించే చోటే ఓటు హక్కు కల్పించాలని సూచించారు. అలాచేస్తే ఓటర్లు సులువుగా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. కాంగ్రెస్, టిడిపి, జనసేన, బీజేపీ, వైసిపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు.



# ఎన్ఎస్ఎస్ శిబిరం ఆధ్వర్యంలో మరో అడుగు

**కదిరి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** నేషనల్ సోషల్ సర్వీస్ కదిరి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత ఆదేశాల మేరకు కదిరి పట్టణంలోని ఎర్రగుంట్ల పల్లి ప్రాంగణంలో మొక్కల నాటు కార్యక్రమం శనివారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కదిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో మొక్కలు నాటు కార్యక్రమాన్ని ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతాయుగతంగా తీసుకుని రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి డిగ్రీ కళాశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిపారు అనంతరం డాక్టర్ స్మిత మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆదర్శనీయమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు ,సేవా కార్యక్రమాల ద్వారా ప్రతిరోజు ముందడుగు వేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమానికి సర్సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో నేషనల్ సోషల్ సర్వీస్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ పిఓ యూనిట్ 1, డాక్టర్ కృష్ణ నాయక్, యూనిట్ 2, ఎస్, యాసిన్ పీర్, డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




## వీఆర్వో, వీఆర్‌ఏను
# సస్పెండ్ చేసిన కలెక్టర్

**ఒంగోలు, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడు, తొర్రగుడిపాడు గ్రామాల్లో శుక్రవారం వరద నీటిలో విద్యార్థి గల్లంతైన ఘటనపై జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వీఆర్వో, వీఆర్‌ఏను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాద స్థలాన్ని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు.

## కుప్పంలో చైనా వస్తువుల హల్‌చల్

- ◆మోసమే వీరి బ్రాండ్
- ◆బిల్లు లేదు, జీఎస్టీ అసలే లేదు
- ◆వస్తువులు దుకాణం దాటితే గ్యారంటీ కూడా లేదని దబాయిస్తున్న దుకాణదారులు

**కుప్పం, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** కుప్పంలో చైనా వస్తువులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు దీనివల్ల భారీగా గండి పడుతోంది. కుప్పం పట్టణంలో కొన్ని దుకాణాలలో ఎలక్ట్రానిక్ వస్తువులు కొనడానికి వెళ్లిన వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులను ఎమ్మార్పీ రేటు ముద్రించకుండానే వినియోగదారులకు అంటగట్టేస్తున్నారు. సదరు వస్తువులు దుకాణం దాటిన వెంటనే పనిచేయకపోగా తిరిగి దాన్ని ఆ దుకాణదారుని వద్దకు తీసుకువెళ్లి వేరే వస్తువు ఇవ్వాలని కోరితే చైనా వస్తువులకు గ్యారెంటీ లేదని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. దీంతో అటు వస్తువు పోగొట్టుకుని డబ్బులు పోగొట్టుకుని దుకాణా దారుడుతో వాగ్వివాదం చేసుకుంటూ వెళ్ళిపోతున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన అధికారులను వ్యాపారులు కమీషన్లతో సరిపుచ్చుతున్నట్టు వినికిడి. వందల్లో కొన్నా వేలల్లో కొన్నా ఆ వస్తువుకు సదరు దుకాణదారులు జిఎస్టి తో పాటు బిల్లు కూడా ఇవ్వడం లేదు. దీంతో వారంటీ గ్యారెంటీ లేని వస్తువులను విక్రయిస్తున్న దుకాణా దారుల బారినపడి కుప్పం పరిసర ప్రాంత ప్రజలు మోసపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తగ్గించిన జిఎస్టి ధరలపై తగ్గింపు వారోత్సవాల పేరిట ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధుల సమక్షంలో అవగాహన కల్పించారు. అయినా కొందరు వ్యాపారులు ఇదే అదనుగా చేసుకుని కుప్పం ప్రజలను మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ ఖజానాకు గండి పెడుతున్న దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించిన విశ్వనాథ్ రెడ్డి



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** కనేకల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ రాజ్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బైక్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పార్టీ నాగిరెడ్డి, సొల్లాపురం సర్పంచ్ భాస్కర్ రెడ్డి, కల్యకుర్తి ఎంపీటీసీ మారిన, గంగలాపురం ముత్తు దేవేంద్ర, ఎంపీటీసీ గోపాల్ ,బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హల్లి నాగరాజు ,వేమన , కోఆప్షన్ నెంబర్ చిన్న శర్మాస్ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టరేట్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుల ఆదేశాలు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో.. కలెక్టరేట్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్‌కు 12మందితో కూడిన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా అధ్యక్షులుగా కలెక్టరేట్ ఏవో ఆర్ వెంకటనారాయణ, కార్యదర్శిగా రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ కే.శ్రీకాంత్, బాషాలను ఎన్నుకున్నట్లు ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ షేక్ మైనుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైనవారిని పలువురు అధికారులు అభినందించారు.

## దేవా నరసింహప్పకు ఘన సన్మానం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** గోరంట్ల మండలం లోని మల్లాపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పార్లమెంట్ కార్యదర్శి,దేవా నరసింహప్ప యాదవ్ కు మరియు ఆయన సతీమణి దేవా తులసమ్మకు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మల్ల పల్లి పంచాయితీ ఎం. కొత్తపల్లి లోని దేవా నరసింహప్ప స్వగృహంలో మండలం లోని యాదవ సంఘం నాయకులు, యాదవ సంఘం ఉద్యోగులు ఘనంగా పూల మాలలు, శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, రామప్ప, శంకర్, రాఘవ, టీచర్ వెంకటేసులు, క్రిస్టతోపాటు నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### రానున్న మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో. సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** రానున్న మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరదలు మరియు భారీ వర్షాల విపత్తు నిర్వహణ పై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్ లు, మండల అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న మూడు రోజులు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నమయ్య జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఇవ్వడం జరిగిందని, ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి అందరూ ఉద్యోగులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా రెవెన్యూశాఖ డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులం దరినీ అప్రమత్తంగా ఉండేలా చూడాలని, శిధిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి, ఆ ప్రదేశంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఎత్తైన ప్రదేశాలను సురక్షితమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి ముందు జాగ్రత్త ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న వాగులు, వంకలు ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ ఇతర మండల పంచాయతీ శాఖల అధికారుల పరిధిలో ఆటోలో మైకల ద్వారా, దండోరా రూపంలో ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేసే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజు వర్షపాత నమోదును ఎప్పటికప్పుడు మండల జిల్లా స్థాయిలో తెలిసే విధంగా చూడాలని సంబంధిత శాఖను ఆదేశించారు. భారీ వర్షం కారణంగా పశువులు, గొర్రెలు, మేకలను వాగులు వంకలు దాటే సమయంలో పైనుండి వరద నీరుని ప్రవహించే ప్రదేశాలలో వెళ్లకుండా పశువుల కాపర్లు చూసే విధంగా వారికి అవగాహన కల్పించేలా పశుసంవర్ధక శాఖ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు పనిచేయాలన్నారు. కోతకు వచ్చిన పంటలను వాయిదా వేసుకునేలా, పండించిన ధాన్యాన్ని భద్రపరిచే విధంగా రైతులకు మండల, జిల్లాస్థాయిలో ఉన్నటువంటి అధికారులు అవగాహన కల్పించి ఎలాంటి పంట నష్టం జరగకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు. కుంటలు, చెరువులు 80 శాతం నిండిన చెరువులను గుర్తించి ఇరిగేషన్ శాఖ వారు పర్యవేక్షించి వాటిని గుర్తించి జిల్లా స్థాయి అధికారులకు ఎప్పటికి అప్పుడు సమాచారాన్ని చేరవేయాలని, అలాగే ఆ చెరువులకు గండి పడే ప్రదేశాలను గుర్తించి, ఇసుక బస్తాలను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఏర్పాట్లను ప్రతి మండల స్థాయిలో చేసుకోవాలని, ముందస్తుగా మండల గ్రామ స్థాయిలో జెసిబి ఓనర్ల ఫోన్ నెంబర్లను సేకరించి వారు అన్నివేళలా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామ మండల స్థాయి అధికారులకు తెలిపారు. అన్ని రిజర్వాయర్ లలో నీటి నిల్వలపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆరోగ్యశాఖ వారిని జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండేలా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటిని అరికట్టుటకు తగు జాగ్రత్తలు తీసుకొని, మందుల కొరత లేకుండా చూడాలని, సురక్షిత శిబిరాలను ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రత్యేక టీం లను ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీలలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తొందరలో డెలివరీ అయ్యే గర్భిణీ స్త్రీలను దగ్గరలో ఉన్న వారిని అత్యవసరమైతే పీహెచ్సీలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యశాఖఅధికారులు ఆదేశించారు. ముందస్తు సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసే ప్రదేశాలలో అవసరమైతే ప్రజలను ఆ ప్రాంతాలలో ఉంచే సమయంలో స్త్రీలకు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు, వారికి భోజన, త్రాగునీటి సౌకర్యం సానిటేషన్ తదితర ఏర్పాట్లకు బాధ్యత గల సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, పంచాయితీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మరియు ఇతర శాఖల వారితో సమన్వయం చేసుకొని అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ, వారికి కావలసిన మందులు ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలు, పాత భవనాలను గుర్తించి పిల్లలకు సురక్షితంగా ఉండేలా చూడాలన్నారు. తల్లితండ్రులు పిల్లలను చెరువులు, కుంటలు, కాలువలలో నీరు ఎక్కు వగా ఉన్న ప్రాంతాలలో ఈతకు వెళ్లకుండా చూడాలని అన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరా సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ఏమైనా సమస్యలు ఎదు రైతే వెంటనే దాని పరిష్కరించే విధంగా చూడాలన్నారు. మండల, గ్రామ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను, వాగులు, వంకలు సమస్యాత్మకమైన ప్రదేశాలను గుర్తించే విధంగా మండల గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నివేదికలను సంబంధిత పై అధికారులకు చేర్చలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తూ ఏలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా కావలసిన ఏర్పాట్లను, కావలసిన పరికరాలను, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలను, గజ ఈతగాళ్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పోలీసు, అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు. ప్రతి శాఖలో జిల్లా అధికారులు నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో ప్రత్యేక టీములుగా ఏర్పాటు చేసి ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా వారి సెల్ నెంబర్లను కంట్రోల్ రూమ్ నందు నమోదు చేసి ఉంచాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలలో ప్రజలకు త్రాగునీటికి వర్ష భావ పరిస్థితుల్లో కరెంటుకోత ఏర్పడితే వాటిని నివారించేందుకు చర్యల్లో భాగంగా గ్రామ, మండల, పట్టాణ ప్రాంతాలలో త్రాగునీటి ట్యాంకులను ముందుగానే శుభ్రం చేసి వాటిని పూర్తిస్థాయిలో నింపాలని, అవసరం ఉన్నచోట జనరేటర్ సహాయంతో నిరంతరం నిరుఅదించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గుంతలు, కాలువలు, వాగులు వంతెనలు వద్ద అధికంగా ప్రవహించే ప్రాంతాలలో , అలాగే పట్టణ ప్రాంతాలలో నాళాలలో గుంత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో, వాహనాల మళ్లింపు ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు మున్సిపల్ కమిషనర్లు తాసిల్దార్లు ఇతర సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని, ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించే అవకాశం ఉన్న జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కూడా తెలియజేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి , డిఆర్ఓ మధుసూదన్ రావు, అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్ నాథ్ హెగ్డే, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ , డిపిఓ , వ్యవసాయ శాఖ, డిఎంహెచ్ఓ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పశుసంవర్ధక శాఖ హార్టికల్చర్ అధికారులు, తహశీల్దార్లు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, నీటిపారుదల, విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాకీ దుస్తుల్లో కదిలిన మానవత్వం

- ◆ప్రాణదాతలుగా మారిన అన్నమయ్య పోలీసులు
- ◆పోలీసు కుటుంబాలకు మెగా వైద్య శిబిరం
- ◆కార్యక్రమాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ ధీరజ్



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఒక పండుగ వాతావరణం నెలకొంది. విధులు, నిబంధనలు దాటి... అక్కడి పోలీసులు మానవతా దృక్పథాన్ని ప్రదర్శించారు. సమాజ రక్షణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 21 నుండి 31 వరకు జరుగుతున్న సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం అన్నమయ్య జిల్లా పోలీసులు ఒక అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే – రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరం! 'రక్తదానం చేయండి-ప్రాణ దాతలు కండి' అనే ఎస్పీ పిలుపుతో, ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఈ శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, "రక్తదానం అనేది ప్రాణ దానం చేసినట్లే. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రక్తం లేక ఎంతో మంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. వారి అవసరాలు తీర్చడానికే ఈ సంకల్పం," అని ప్రకటించారు. ఈ పిలుపుతో స్ఫూర్తి పొందిన ఏకంగా 100 మందికి పైగా జిల్లా పోలీసులు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చారు. జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారితో పాటు, రాజంపేట ఏఎస్పీ శ్రీ మనోజ్ రామనాథ్ హెగ్డే ఐపీఎస్ గారు, మదనపల్లి డిఎస్పీ యస్ మహేంద్ర ఏఆర్ డీఎస్పీ యం. శ్రీనివాసులు గారు సహా పలువురు పోలీసు అధికారులు రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు. రక్తదానం చేసిన ప్రతి పోలీసునూ ఎస్పీ అభినందించి, పండ్లు, జ్యూస్ బాటిళ్లను అందజేయడం విశేషం. "పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటేనే, వారు శాంతి భద్రతలను మరింత సమర్థంగా కాపాడగలుగుతారు," అనే ఉద్దేశ్యంతో జిల్లా ఆసుపత్రుల ముఖ్య డాక్టర్ల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, అత్యంత ముఖ్యమైన డర్మటాలజిస్ట్, డెంటల్, గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఫిజీషియన్, ఆప్తమాలజిస్ట్ వంటి నిపుణులతో వైద్య పరీక్షలు చేయించారు. కుటుంబ సభ్యులు ఎంతో సంతోషంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శ్రీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ మానవీయ సేవలో పాలుపంచుకున్న రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ , సిఎస్ ఆర్ఎంఓ డాక్టర్ కిరణ్ కుమార్ , ప్రభుత్వ వైద్యులు నవీన్ కుమార్, శైలేష్, మహేశ్వర రాజు, రామరాజు, నాగరాజు, మస్తాన్ రావు, ప్రశాంతి మరియు వైద్య సిబ్బందికి ఎస్పీ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంలో అదనపు ఎస్పీ (పరిపాలన) యం. వెంకటాద్రి, ఇతర సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హెూంగార్డు సిబ్బంది మరియు వారి కుటుంబాలు పాలుపంచుకున్నారు.







Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# రానున్న నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- బంగాళాఖాతంలో అల్పపీడనం 'మంథా' ద్రోణి ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు పాటించి నష్ట నివారణను చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** బంగాళాఖాతంలో అల్పపీడనం 'మంథా' ద్రోణి ప్రభావంతో.. విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ సూచించిందని.. రానున్న నాలుగు రోజులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ లోని తన చాంబర్ నుంచి బంగాళా ఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం 'మంథా' ద్రోణి వల్ల కురిసే వర్షాల విపత్తు నిర్వహణ పై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులు, ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న నాలుగు రోజులు ఎంతో కీలకం అన్నారు. 'మంథా' ద్రోణి వల్ల జిల్లాలో మోస్తరు నుంచి విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తచర్యలు తీసుకోవాలన్నారు. ఆయాశాఖలలో ఉద్యోగులు అందరూ అందుబాటులో ఉండే విధంగా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా డివిజన్, మండల, గ్రామస్థాయి రెవెన్యూశాఖ అధికారులందరినీ అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి, ఆ ప్రదేశంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఎత్తైన ప్రదేశాలను సురక్షితమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించి ముందు జాగ్రత్త ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. గ్రామ పరిధిలో ఉన్న వాగులు, వంకలు ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ ఇతర మండల పంచాయతీ శాఖల అధికారుల పరిధిలో ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేసే విధంగా చూడాలన్నారు. ఎక్కడ కూడా భారీ వర్షాల కారణంగా ప్రాణ వసు ఆస్తి నష్టం కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలను వాగులు వంకలు దాటే సమయంలో పై నుండి వరద నీరుని ప్రవహించే ప్రదేశాలలో వెళ్లకుండా పశువుల కాపర్లకు అవగాహన కల్పించేలన్నారు. ఇందుకు పశు సంవర్ధక, గ్రామస్థాయి వ్యవసాయ అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. కోతకు వచ్చిన పంటలను వాయిదా వేసుకునేలా, పండించిన ధాన్యాన్ని భద్రపరిచే విధంగా రైతులకు మండల, జిల్లా స్థాయిలో ఉన్నటువంటి అధికారులు అవగాహన కల్పించి ఎలాంటి పంట నష్టం జరగకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు. కుంటలు, చెరువులు 80 శాతం నిండిన చెరువులను గుర్తించి ఇరిగేషన్ శాఖ వారు పర్యవేక్షించి వాటిని గుర్తించి జిల్లా స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని, అలాగే ఆ చెరువులకు గండి పడే ప్రదేశాలను గుర్తించి, ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని రిజర్వాయర్ లలో నీటి నిల్వలపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా చెట్లు స్తంభాలు నేలకొరిగితే వెంటనే వాటిని తొలగించేలా మండల గ్రామ స్థాయిలో జెసిబి ఓనర్ల ఫోన్ నెంబర్లను సేకరించి వారు అన్నివేళలా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశాఖ వారిని జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండేలా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటిని అరికట్టుటకు తగు జాగ్రత్తలు తీసుకొని, మందుల కొరత లేకుండా చూడాలని, సురక్షిత శిబిరాలను ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రత్యేక టీం లను ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీలలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, డెలివరీ సమయం దగ్గరపడిన గర్భిణీ స్త్రీలను అత్యవసరమైతే దగ్గరలోని పీహెచ్సీలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, పంచాయితీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ మరియు ఇతర శాఖల వారితో సమన్వయం చేసుకొని అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ, వారికి కావలసిన మందులు ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలలో, పాత భవనాలను గుర్తించి అందులో పిల్లలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను, వాగులు, వంకలు సమస్యాత్మకమైన ప్రదేశాలను గుర్తించే విధంగా మండల గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నివేదికలను సంబంధిత పై అధికారులకు చేర్చలన్నారు. మండల స్థాయిలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తూ ఏలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా కావలసిన ఏర్పాట్లను, కావలసిన పరికరాలను, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని పోలీసు, అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు. ప్రతి శాఖలో నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిలో ప్రత్యేక టీములుగా ఏర్పాటు చేసి ఎప్పుడు అందుబాటులో ఉండే విధంగా వారి సెల్ నెంబర్లను కంట్రోల్ రూమ్ నందు నమోదు చేసి ఉంచాలని తెలిపారు. వర్షాల వల్ల త్రాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వాటిని వెంటనే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గుంతలు, కాలువలు, వాగులు వంతెనలు వద్ద అధికంగా నీరు ప్రవహించే ప్రాంతాలలో, అలాగే పట్టణ ప్రాంత నాళాలలో గుంత ఎక్కువగా ఉన్న ప్రాంతంలో, వాహనాల మళ్లింపు ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లు తాసిల్దార్లను ఆదేశించారు. ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించిన తరువాత చర్యలు తీసుకోవడం కన్నా, ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షాలకు సంబంధించి ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు జిల్లా డివిజన్ మండల స్థాయి ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ లని సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బిఎస్ఎన్ఎల్ ఎయిర్టెల్, వోడాఫోన్ జియో తదితర సెల్లులార్ నెట్వర్క్ వారితో కూడా కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించి.. వర్షాలు కురుస్తున్న సమయంలో నెట్వర్క్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.

## బాల్య వివాహాల రహిత సమాజమే లక్ష్యం

**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మరియు ఐసిడిఎస్ పి డి ప్రమీల ఆదేశాల మేరకు సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి ఉన్నత పాఠశాలలో కిషోరివికాశం – నో బ్యాగ్ డే కార్యక్రమం ఏర్పాటు చేశారు ,ముఖ్య అతిథిగా పుట్టపర్తి సిడిపివో ఈ జయంతి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈనాటి బాలికలే రేపటితరం అమ్మలని సమాజం నిర్మాణానికి పునాదులన్నారు. బాల్యవివాహారహిత సమాజమే లక్ష్యంగా యుక్త వయస్సు బాలికలకు చదువు యొక్క ఆవశ్యకతను గురించి బాల్య వివాహాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి సమాజం పట్ల వారికున్న బాధ్యత గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజుల వాణి మాట్లాడుతూ బాల్యవివాహాలు బలమైన సమాజ నిర్మాణానికి గొడ్డలి పెట్టు అని వాటిని నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిదేనన్నారు.



కార్యక్రమంలో డిసిపివో స్టాఫ్ మురళీ, సూపర్వైజర్ అయ్యగారి రజితతోపాటు నోడల్ అధికారిని, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కిషోరబాలికలు పాల్గొన్నారు.

# 16 నెలల్లో రాష్ట్ర అభివృద్ధి శూన్యం

### మెట్టు విశ్వనాథ్ రెడ్డి - కనేకల్‌లో వైఎస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమ పోస్టర్ విడుదల

### మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28న రాయదుర్గంలో భారీ ర్యాలీ



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** రాయదుర్గం నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపి మెట్టు గోవిందరెడ్డి ఆదేశాల మేరకు, కనేకల్ మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. ఇది ప్రజాధన దోపిడీకి నిదర్శనం" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించగా, వాటిలో ఐదు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని, మరో రెండు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ మోడల్ పేరిట మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే నిర్ణయం తీసుకోవడం దారుణమని అన్నారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే అవినీతి, అక్రమాలు, పాల్పడుతోందని, రాష్ట్ర అభివృద్ధి శూన్యతతో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ముఖ్యంగా వైద్య, విద్యా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని విశ్వనాథ్‌రెడ్డి విమర్శించారు. కనేకల్ మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, అత్యవసర సేవల కోసం 108 అంబులెన్స్ సదుపాయం లభించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ వంటి పథకాలు నేడు పూర్తిగా క్షీణించాయి. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది" అని అన్నారు. అక్టోబర్ 28న రాయదుర్గం పట్టణంలో వైఎస్ఆర్‌సీపీ కుటుంబ సభ్యుల భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి, కోట్లాది సంతకాలతో గవర్నర్‌కు నివేదన పంపే కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. "ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపే వరకు వైఎస్ఆర్‌సీపీ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ప్రజలతో కలిసి ఈ ఉద్యమాన్ని విజయవంతం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలు, వినతిపత్ర సమర్పణలు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జిల్లా%-%రాష్ట్ర స్థాయి వైసీపీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, వైసీపీ కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రేపు పీజీఆర్ఎస్ రద్దు



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** ఈ నెల 27 న సోమవారం జిల్లాలో అధిక వర్షపాతం కురిసే అవకాశం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (%ూ+=ా% ) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం రద్దు అయినందున, అర్జీదారులు జిల్లా పోలీస్ కార్యాలయానికి రావొద్దని ఎస్పీ కోరారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

## సహాయక చర్యల సంసిద్ధతపై తనిఖీలు



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం పుల్లంపేట తాసిల్దార్ కార్యాలయం గుంజానా నది పరివాహక ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి కంట్రోల్ రూమ్ మరియు సహాయక చర్యల ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ భావనకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం పుల్లంపేట తాసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భారీ వర్షాలు నేపథ్యంలో సంసిద్ధతపై తాసిల్దార్‌కు ఎంపీడీవోకు తగు సూచనలు జారీ చేశారు. అనంతరం గుంజానా నది పరివాహ ప్రాంతాన్ని పరిశీలించి, నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో అన్ని సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని వివిధ శాఖల జిల్లా అధికారులను, అన్ని మండలాల తాసిల్దారులను, ఎంపీడీవోలను ఆదేశించారు.

## సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జడ్జి



**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** జైలు జీవితం అనంతరం ఖైదీల జీవితాల్లో మార్పు రావాలని, మంచి ప్రవర్తనతో జీవితం గడపాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ జడ్జి జోష్ణదేవి అన్నారు. శనివారం పత్తికొండ సబ్ జైలను ఆమే తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైల్లో ఖైదీలు ఎన్ని రోజులుగా శిక్షా అనుభవిస్తున్నారు, లాయర్లను ఏర్పాటు చేసుకున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జైల్లో అందిస్తున్నా సేవలు, సౌకర్యాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్యానెల్ లాయర్ సూరజ్ నబి, న్యాయవాదులు రవిప్రకాష్, రంగన్న, లోకదాలత్ క్లార్క్ రాఘవేంద్ర, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన డీఆర్వో మలోలా



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం,అక్టోబర్ 25:** అనంతపురంలోని పాత ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మలోలా శనివారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ గదులలో భద్రపరిచిన తలుపులకు వేసిన సీళ్ళను డీఆర్వో పరిశీలించారు. అనంతరం డీఆర్వో మలోలా మాట్లాడుతూ గోడౌన్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, గోడౌన్ గదులతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని భారత ఎన్నికల సంఘం మరియు ప్రభుత్వం ఆదేశం మేరకు జిల్లా కేంద్రంలో ఉన్న ఈవీఎం గోడౌన్లను ప్రతి మాసానికి, అలాగే త్రైమాసానికి ఒకసారి తనిఖీల ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మాసంలో భాగంగా గోడౌన్ ను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతవర్షాకాలంలో నిరంతర విద్యుత్ సరఫరా, వర్షపు నీటి నిలువ తదితర అంశాలపై దృష్టిని సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారు. అనంతరం సందర్శన రిజిస్టర్‌లో డీఆర్వో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం తాసిల్దార్ హరిప్రసాద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ కనకరాజు, ఎస్ఏ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు వ్యవస్థలో సాంకేతికత పాత్రపై వ్యాసరచన పోటీలు



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** అనంతపురం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, సిబ్బందికి "ప్రస్తుత కాలంలో పోలీసు వ్యవస్థలో సాంకేతికత పాత్ర" అనే అంశంపై వ్యాసరచన మరియు వకృత్వ పోటీలు నిర్వహించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ... జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందిలో గల సృజనాత్మకత ఆలోచన శక్తిని వెలికితీయడం కోసం ఆధునిక పోలీసు వ్యవస్థ పట్ల అవగాహన పెంపొందించుకోవడానికి " ప్రస్తుత కాలంలో పోలీస్ వ్యవస్థలో సాంకేతికత పాత్ర అనే అంశంపై వ్యాసరచన మరియు వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఇందులో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ ల నుండి పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వ్యాసరచన మరియు వకృత్వ పోటీల ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ సాంకేతికత పోలీసుల విధుల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ఇది నేరాలను నివారించడం, గుర్తించడం, దర్యాప్తు చేయడంలో పోలీసుల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతోందనీ,శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోసిస్తుందని క్రింది విధంగా వివరించారు.నేర నియంత్రణ మరియు నిఘా గ్రామీణ /పట్టణాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ, ట్రాఫిక్ నిర్వహణ మరియు నేరాల గుర్తింపు సులభం అవుతుంది. అదేవిదంగా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడినప్పుడు, విపత్తుల సమయంలో, లేదా నేరస్థులను ట్రాక్ చేయడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారని ఇవి రియల్ టైమ్ ఏరియల్ ఫుటేజీని అందిస్తాయి, ఇది పరిస్థితులను అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది మరియు నేరస్తులను,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

**దర్యాప్తు , సాక్ష్యాల సేకరణ:** ఆధునిక నేర దర్యాప్తులో డిజిటల్ సాక్ష్యాల సేకరణ కీలకం. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల నుండి సమాచారాన్ని సేకరించి, కోర్టులో సాక్ష్యంగా సమర్పించడం దీనిలో భాగం. ఇంటర్నెట్ ఆధారిత నేరాలైన సైబర్ స్టాకింగ్, ఆన్‌లైన్ మోసాలు, మరియు హ్యాకింగ్‌లను పరిష్కరించడానికి ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇవి అధునాతన ఫోరెన్సిక్ సాధనాలను ఉపయోగిస్తాయి. ముఖ్యమైన పండుగలు ఊరేగింపులు , వి.వి.ఐ.పి బందోబస్తు మొదలగు వాటిలలో సాంకేతికతను ఉపయోగించడం ద్వారా తప్పిపోయిన వారిని, నేరస్థులను గుర్తించడం పోలీసులకు సులభం అవుతుందనీ ప్రజల భద్రత మరియు సేవలు మహిళలు మరియు విద్యార్థినుల భద్రత కోసం శక్తి టీమ్స్ వంటి విభాగాలు మొబైల్ నంబర్ల ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తున్నాయి.




పెట్రోలింగ్ వాహనాల్లో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో దగ్గరలో ఉన్న వాహనాలను పంపడం సులభం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లు పవన్ కుమార్, మధు, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బూల్, రమేష్ నాయక్ మరియు జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిగితే చర్యలు

◆ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య




**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** జిల్లావ్యాప్తంగా అనధికారికంగా, బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్, ఎక్సైజ్, పి.నాగమద్దయ్య పేర్కొన్నారు. ఆయన శనివారం స్థానిక జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్అధికారి, జిల్లా, కార్యాలయంలో జిల్లాలోని అన్నిస్టేషన్ల ఇన్స్పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని షాపు లలో, బార్లలో ప్రతి ఒక్క మద్యం బాటిల్ ఎక్సైజ్ సురక్ష ఆప్ ద్వారానే అమ్మకాలు జరపాలని ఆదేశించారు. ప్రజల్లో ఎక్సైజ్ సురక్ష ఆప్ యొక్క పనితీరు పై అవగాహన కల్పించాలని తద్వారా ప్రజల్లో నకిలీ మద్యంపై అపోహలను తొలగించాలని సూచించారు. తమ పరిధిలోని బెల్ట్ షాపులు మొత్తం నియంత్రించాలని ఎక్కడా అనధికారికంగా మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపు నిర్వాహకులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. అనదికారికముగా బెల్ట్‌షాప్‌లకు మద్యం సరఫరా చే సినచో లైసెన్స్‌దారులపై కఠిన చెర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసారు. అక్రమ మద్యం జిల్లాలోకి చొరబడకుండా నిఘా పెంచాలని, రూట్‌వాచ్ చేయాలనీ ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్, మంగళగిరి వారి ఆదేశముల మేరకు జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవింద్ నాయక్, అసిస్టెంట్ ప్రోహిబిషన్ ,ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు , అసిస్టెంట్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు సూపరింటెండెంట్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ శ్రీరామ్ నాగరాజు ,స్వయంగా వెళ్లి ఎక్సైజ్ సురక్ష యాప్ సంబంధించిన కరపత్రాలను నౌకరు నామా దారులకు అందజేసి వారికి, వినియోగదారులకు ఎక్సైజ్ సురక్ష యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి గోవింద నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. నరసింహులు, అసిస్టెంట్ ప్రోహిబిషన్ ,సూపరింటెండెంట్ ఎన్ఫోర్స్మెంట్, అనంతపురము శ్రీరామ్ జిల్లాలోని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## కోటి సంతకాలతో కూటమి ప్రభుత్వ
# కళ్లు తెరిపిద్దాం: మేయర్ మహమ్మద్ వసీం




**అనంతపురం టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** రాష్ట్రంలో పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమంతో కూటమి ప్రభుత్వ కళ్ళు తెరిపిద్దామని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. పీపీపీ విధానానికి వ్యతిరేకంగా నగరంలోని 43వ డివిజన్ పరిధిలో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం పాల్గొన్నారు.ఈసందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి పీపీపీ విధానం వల్ల కలిగే నష్టాన్ని వివరించి వాటికి వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మాణం చేపట్టి వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ఆధునిక వైద్యాన్ని పేదలకు అందించాలని సంకల్పంతో చేపట్టారన్నారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెడికల్ కాలేజీ లను పిపిపి విధానం తీసుకువచ్చారన్నారు.పీపీపీ విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేట్ పరం చేయడం వల్ల సీఎం చంద్రబాబు నాయుడు తన వారికి మేలు చేకూర్చి ప్రజలకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. పీపీపీ విధానం రద్దు చేసే వరకు వైసీపీ పోరాడుతుందన్నారు .కార్యక్రమంలో కార్పొరేటర్ ఇషాక్,వైసీపీ మున్సిపల్ విభాగం సిటీ వైస్ ప్రెసిడెంట్ కిషోర్ బాబు,యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ధనుబాబు, మైనార్టీ నాయకులు మసూద్, షేక్షావలి, 43వ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ వడ్డే గణేష్, నాయకులు వడ్డే నంది, వడ్డే యశ్వంత్ ,తలారి నరేంద్ర జహీర్ ,యూసుఫ్, దాసరి కార్తీక్, ముద్దు కృష్ణ, దాల్లప్ప, పార్థు ,దుర్గా, ప్రణీత్ ,నాని, ప్రేమ్ కార్తిక్, తయుబ్, ముని, జగ్గులు, చిరు, అక్మల్ తదితరులు పాల్గొన్నారు.





## రాయచోటి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలి

◆రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం,అక్టోబర్ 25:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రాయచోటి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. భారత దేశంలోనే రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోక వెనుకబడిన ప్రాంతమని, అందులోను రాయచోటి ప్రాంతం మరింత వెనుకబడిన ప్రాంతమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాగా తెలిసిన విషయమే అని తెలిపారు. ఈ ప్రాంత వెనుకబాటుతనం ప్రాతిపాదికన అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రకృతి వనరులు ఆధారంగా నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు




**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** రోడ్డు సేఫ్టీ, ప్రజల భద్రత కోసం జిల్లాలోని ప్రధాన రహదారులు, జంక్షన్లు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు."ప్రజల భద్రత పోలీసుల ప్రధాన ధ్యేయం. నేరాలను అరికట్టడం, చట్ట ఉల్లంఘనలను నిరోధించడం కోసం జిల్లాలో వాహనాల తనిఖీలు ప్రతీరోజు నిర్వహిస్తున్నారు. చట్టబద్ధమైన పత్రాలు ఉన్నవారికి ఎటువంటి ఇబ్బంది ఉండకుండా చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో లైసెన్స్, రిజిస్ట్రేషన్... అలాగే హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడిపినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు పోలీసుల తనిఖీలకు సహకరించాలని, వాహన పత్రాలను ఎప్పుడూ వెంట ఉంచుకోవాలని, అలాగే అనుమానాస్పద వాహనాలు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



## మండల స్థాయి క్రీడా పోటీలు

**నంబుల పూలకుంట, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు నిర్వహిస్తూన్నట్లు హెడ్మాస్టర్ మోహన్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయుడు సందీప్ ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ సుహాసిని తెలిపారు. చదువులతోపాటు క్రీడలలో రాణించి ఆయా పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు .మండల స్థాయిలో వివిధ పాఠశాలలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ధనియాని చెరువు జడ్పీ హైస్కూల్, టి ఎన్ పల్లి జెడ్పీ హైస్కూల్, గూటిబైలు జడ్పీ హైస్కూల్ లలో చదువుతున్న బాల బాలికలు పాల్గొన్నారు . మొదటిరోజు అయిన శనివారం బాలురుకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు 14 సం? లకు మరియు 17 సం౹ఎలోపు ఉన్న బాలురుకి నిర్వహించడం జరిగింది . చివరి రోజు రోజున అథ్లెటిక్ పోటీలు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు 800 మీటర్లు, పోటీలు నిర్వహించనున్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, శివయ్య, శంకర్ వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ పథకాల అమలుపై సమీక్ష





**అనంతపురం టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పతాకాలపై ఆశాఖ ఇంచార్జ్ పీడీ అరుణ కుమారి శనివారం సమీక్షించారు. అనంతపురంలోని జిల్లా కార్యాలయంలో గల తన ఛాంబర్‌లో సీడీపీఓలతో ఆమె సమావేశమ య్యారు. ముఖ్యంగా ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు అంశాల్లో వెనుకబడిన ప్రాజెక్టులు ప్రత్యేక నెల రోజుల్లోపు పూర్తి స్థాయి ప్రగతి సాధించాలని ఆదేశించారు. కొందరు సీడీపీఓలు, ఎస్ఈడపీఓలపై విపరీతమైన ఆరోపణలు ఉన్నాయని, పత్రికల్లోనూ కథనాలు వస్తున్నాయని తెలిపారు. అటువంటి వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతానని స్పష్టం చేసారు. అన్ని అంశాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉండడమే తనకు కావాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీ మున్నీసా పాల్గొన్నారు.

## మహిళపై దూసుకెళ్లిన బస్సు

◆నుజ్జు నుజ్జయిన కాలు



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** కదులుతున్న బస్సులోంచి మహిళ దిగుతుండగా ఆమె కాలుపై బస్సు చక్రాలు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, చీకటిమానుపల్లెకు చెందిన హరికృష్ణ భార్య సుజాత (26) అంగళ్ల సమీపంలోని ఓ పాఠశాలలో చదువుతున్న తన పిల్లలను చూసేందుకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో కదిరి బస్సు ఎక్కాల్సింది పోయి, పొరపాటున బి. కొత్తకోట బస్సు ఎక్కింది. మార్గమధ్యంలోని కాండ్లమడుగు క్రాస్ వద్ద బస్సు బి. కొత్తకోట వైపు వెళుతుండడంతో గమనించి వెంటనే ఆపమని, బస్సు ఆపేలోపే కిందకి దిగింది. ఈ క్రమంలో బస్సు వెనక చక్రాలు ఆమె కాలుపై దూసుకెళ్లాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి, కాలు నుజ్జునుజ్జు అయ్యింది. వెంటనే బస్సులోని ప్రయాణికులు బాధితురాలిని 108 రాజు, జయరామ్ లు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. బి. కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భిన్న ప్రేమకథ..




రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్‌కు రాబోతోంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ,'రిలేషన్ షిప్ ట్రై చేయాలనుకునే వారు ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. ఇది రెగ్యులర్ ఫార్మేట్ లవ్ స్టోరీ కాదు' అని అన్నారు. 'ప్రతి ఒక్క ప్రేక్షకుడి మనసుకు హత్తుకునేలా మూవీ ఉంటుంది' అని ప్రొడ్యూసర్ విద్యా కొప్పినీడి చెప్పారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ,'రష్మిక లేకుంటే ఈ సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు.

వీళ్లిద్దరు తమ పర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకుంటారు' అని చెప్పారు. నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ',తమ గర్ల్‌ఫ్రెండ్‌తో ఈ సినిమాకు వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండండి' అని అన్నారు. 'రష్మికకు ఈ సినిమాతో బెస్ట్ యాక్టర్ అవార్డ్స్ వస్తాయి. ఈ సినిమా చూశాకే దీక్షిత్ ఎంత మంచి పర్‌ఫార్మర్ అనేది ఆడియెన్స్ తెలుసుకుంటారు' అని నిర్మాత అల్లు అరవింద్ చెప్పారు. హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ,"దసరా' సినిమాలో సూరి క్యారెక్టర్‌ను మీరు ఎంతగా ఇష్టపడ్డారో, ఇందులో విక్రమ్‌ను అంతగా ఇష్టపడటంతో పాటు ద్వేషిస్తారు' అని అన్నారు. 'ఈ సినిమా కథ విన్నప్పుడు ఇలాంటి లవ్ స్టోరీని ఇప్పటిదాకా మనం చూడలేదు అనిపించింది. ఇందులో భూమా అనే పాత్రలో నటించాను. కేవలం బెస్ట్ ఫ్రెండ్స్ తోనే కొన్ని మన విషయాలు షేర్ చేసుకుంటాం. అలాంటి కంటెంట్ ఉన్న మూవీ ఇది' అని హీరోయిన్ రష్మిక మందన్న చెప్పారు.


# 'బైకర్' కోసం..



శర్వా హీరోగా తన 36వ చిత్రం 'బైకర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. స్పోర్ట్స్, ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తుండగా, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. దీపావళి సందర్భంగా విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్ పాత్రలో కనిపించబోతున్న శర్వా తన పాత్ర కోసం ఊహించని రీతిలో ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. తాజాగా విడుదలైన స్టిల్స్‌లో ఆయన ఫిజిక్, కాన్ఫిడెన్స్ అంతా కలిపి కొత్త శర్వాని ప్రజెంట్ చేశాయి. అంతేకాదు రేసర్ స్పిరిట్‌ను అద్భుతంగా చూపించారు. శర్వా తన పాత్రకు సరిపడేలా లీన్ అండ్ అథ్లెటిక్ బాడీని తీర్చిదిద్దుకున్నారు. నెలల తరబడి వర్కౌట్స్, డైట్, డెడికేషన్‌తో ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించారు. ఇంత ఫిట్‌గా, ఎనర్జీగా శర్వా కనిపించడం అభిమానులకు పండుగలా మారింది. శర్వా కొత్త లుక్, కథ కాన్సెప్ట్, టాప్ టెక్నికల్ టీమ్ ఇవన్నీ కలసి 'బైకర్' సినిమాను ఒక థ్రిల్లింగ్ ఎమోషనల్ రైడ్‌గా మార్చబోతున్నాయి. అభిమానులు ఇప్పుడు శర్వా కొత్త అవతార్‌ని థియేటర్స్‌లో చూడటానికి ఎదురుచూస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ: జె. యువరాజ్, మ్యూజిక్: జిబ్రాన్, ఎడిటర్ : అనిల్ కుమార్ పి, ప్రొడక్షన్ డిజైనర్ : రాజీవన్, ఆర్ట్ డైరెక్టర్ : ఎ పన్నీర్ సెల్వం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎన్ సందీప్.

# 'జో లాలి జో'..

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఇటీవల రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యాయి.



'సోల్ ఆఫ్ జటాధార, ధన పిశాచి' సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా మేకర్స్ 'జో లాలి జో..' సాంగ్ రిలీజ్ చేశారు. రాజీవ్ రాజ్ ఈ పాటని అద్భుతమైన లాలి పాటగా కంపోజ్ చేశారు. శ్రీమాన్ కీర్తి లిరిక్స్, పావని వాసా, రాజీవ్ రాజ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి.

ఈ చిత్రంలో దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ నటులు కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హల్, నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలు. నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

# హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్..

వరుణ్ తేజ్, డైరెక్టర్ మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతోంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్‌తోపాటు ముఖ్య తారాగణం పాల్గొంటున్న ఈ కీలక షెడ్యూల్‌లో చాలా ఇంపార్టెంట్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్. హర్రర్-కామెడీ, ఇండియన్ -కొరియన్ బ్యాక్‌డ్రాప్ ఇలా.. ఓ యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే మన దేశంతోపాటు విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ కంప్లీట్ చేశారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్, తమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది అని చిత్ర యూనిట్ తెలిపింది. వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం : మేర్లపాక గాంధీ, నిర్మాతలు: యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్, సంగీతం: ఎస్.తమన్.







# రో-కో షో..

**సిడ్నీ:** వన్డే సిరీస్ చేజార్చుకున్న టీమిండియా.. చివరి వన్డేలో దుమ్ము రేపింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 237 పరుగుల లక్ష్యాన్ని భారతజట్టు కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి 2వ వికెట్‌కు అజేయంగా 168 పరుగులు జతచేసి మ్యాచ్‌ను ముగించారు. దీంతో భారతజట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను భారత బౌలర్లు కట్టడి చేశారు. హర్షిత్ రాణా(4/39), సుందర్(2/44)కి తోడు సిరాజ్, ప్రసిధ్, కుల్దీప్, అక్షర్ ఒక్కో వికెట్‌తో రాణించారు. దీంతో ఆస్ట్రేలియా 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో టీమిండియాకు శు భారంభం లభించింది. శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. 24 పరుగుల వద్ద హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి కెప్టెన్ శుభ్‌మన్ వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లి తొలి బంతికే తన పరుగుల ఖాతా తెరిచాడు. తొలి రెండు వన్డేల్లో డకౌట్ అయిన కోహ్లి ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు.

రో-కో ధాటికి ఆసీస్ బౌలర్లు తేలిపోయారు. వీరు రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగులు జత చేసి మ్యాచ్‌ను ముగించారు. రెండో మ్యాచ్‌లో అర్ధ శతకం చేసిన రోహిత్ ఈ వన్డేలో 105 బంతుల్లో సెంచరీ కొట్టాడు. 125 బంతుల్లో 121 పరుగులతో అజేయంగా నిలిచాడు. రోహిత్ శర్మ కెరీర్‌లో ఇది 50వ సెంచరీ. వన్డేల్లో అతడికిది 33వ శతకం. ఇక విరాట్ కోహ్లి 56 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. 81 బంతుల్లో 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రో-కో ద్వయం రాణించడంతో టీమిండియా 38.3 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా అందుకుంది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ మాత్రమే ఒక వికెట్ పడగొట్టాడు. అంతకుముందు ఆసీస్ బ్యాటర్లలో మ్యాట్ రెన్‌షా(56), మిచెల్ మార్ష్(41) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. 1986 తర్వాత ఇలా ఆసీస్‌పై ప్రతి బౌలరూ వికెట్ తీయడం ఇదే తొలిసారి. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో కైవసం చేసుకోగా.. 29(బుధవారం) నుంచి ఐదు టి20 సిరీస్ ప్రారంభం కానుంది.

**రోహిత్ 50వ సెంచరీ**

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 50వ సెంచరీని కొట్టాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి 50 సెంచరీలు కొట్టిన రోహిత్%ా% ఒక్కో ఫార్మాట్‌లో ఐదు అంతకుమించి సెంచరీలు కొట్టిన ఏకైక బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ రోహిత్ శర్మకు దక్కాయి.

**స్కోర్‌బోర్డు:**

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిఛెల్ మార్ష్ (బి)అక్షర్ 41, హెడ్ (సి)ప్రసిధ్ (బి)సిరాజ్ 29, షార్ట్ (సి)కోహ్లి (బి)సుందర్ 30, రెన్‌షా (ఎల్‌బి)సుందర్ 56, క్యారీ (సి)శ్రేయస్ (బి)హర్షిత్ రాణా 24, కూపర్ (సి)కోహ్లి (బి)హర్షిత్ రాణా 23, ఓవెన్ (సి)రోహిత్ (బి)హర్షిత్ రాణా 1, స్టార్క్ (బి)కుల్దీప్ 2, ఎల్లిస్ (సి)రోహిల్ (బి)ప్రసిధ్ 16, జంపా (నాటౌట్) 2, హేజిల్‌వుడ్ (బి)హర్షిత్ రాణా 0, అదనం 12. (46.4ఓవర్లలో ఆలౌట్) 236పరుగులు.

**వికెట్ల పతనం:** 1/61, 2/88, 3/124, 4/183, 5/195, 6/198, 7/201, 8/223, 9/236, 10/236

**బౌలింగ్:** సిరాజ్ 5-1-24-1, హర్షిత్ రాణా 8.4-0-39-4, ప్రసిధ్ 7-0-52-1, కుల్దీప్ 10-0-50-1, అక్షర్ 6-0-18-1, సుందర్ 10-0-44-2.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (నాటౌట్) 121, శుభ్‌మన్ గిల్ (సి)క్యారీ (బి)హేజిల్‌వుడ్ 24, కోహ్లి (నాటౌట్) 74, అదనం 18. (38.3ఓవర్లలో వికెట్ నష్టానికి) 237పరుగులు.

**వికెట్ల పతనం:** 1/

**బౌలింగ్:** స్టార్క్ 5-0-31-0, హేజిల్‌వుడ్ 6-1-23-1, ఎల్లిస్ 7.3-0-60-0, కూపర్ 5-0-36-0, జంపా 10-0-50-0, ఓవెన్ 1-0-2-0, షార్ట్ 4-0-29-0.

**రో-కో రీలోడెడ్**

రోహిత్, కోహ్లి (రో-కో) కలిసి నిలబడితే భారత్‌కు ఎదురే లేదని మరోసారి రుజువైంది. సగటు భారత అభిమాని కోరుకునేది ఇదే కదా..! చాలా రోజుల తర్వాత ఇద్దరూ కలివిడిగా ఆడి.. విడివిడిగా గెలిచారు.. భారత్‌ను గెలిపించారు. రిటైర్మెంట్ వార్తల వేళ ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో రోహిత్ సెంచరీ, విరాట్ అర్ధ సెంచరీ చేసి అందరినీ మరోసారి ఆకట్టుకున్నారు.

# సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఆస్ట్రేలియా



ఇండోర్: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో టీమిండియా ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. దక్షిణాఫ్రికాతో శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆస్ట్రేలియా జట్టు 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. దక్షిణాఫ్రికా జట్టు రెండోస్థానానికే పరిమితమైంది. నేడు చివరి లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. ఈ మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా సెమీస్ బెర్త్‌లు ఇప్పటికే ఖరారయ్యాయి. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య 29(బుధ) తొలి సెమీస్, భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య 30(గురు) రెండో సెమీస్ జరగనుంది. ఈ మెగా టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు ఒక్క మ్యాచ్‌లోనూ పరాజయాన్ని చవిచూడకుండా సెమీస్‌కు చేరడం విశేసం.

**దక్షిణాఫ్రికాపై ఆసీస్ అలవోకగా**

ప్రపంచ కప్‌లో అద్భుత విజయాలతో టాప్‌లో నిలిచిన దక్షిణాఫ్రికా మహిళల జట్టుకు చివరి లీగ్‌లో ఆస్ట్రేలియా చేతిలో పరాభవం తప్పలేదు. తొలి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 69 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా జట్టు.. శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో 97 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఆసీస్‌ను ఓడించి ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలనుకున్న దక్షిణాఫ్రికా ఆశలు అడియాశలయ్యాయి. ఇండోర్‌లో ఏకపక్షంగా సాగిన పోరులో అలనా కింగ్(7/18) సంచలన బౌలింగ్‌తో ప్రతర్థిని కుప్పకూల్చింది. స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ 16.5 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను ముగించింది. బేత్ మూనీ(42) ఔటైనా.. సథర్‌లాండ్(10 నాటౌట్) రెండు ఫోర్లు బాదడంతో ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. టాస్ గెలిచి సఫారీలను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన ఆస్ట్రేలియా.. అలనా కింగ్ కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో చెలరేగడంతో దక్షిణాఫ్రికా 97 పరుగులకు కుప్పకూలింది.

స్పిన్నర్ అలనా కింగ్(7-18) తిప్పేయగా.. బ్యాటర్లు సమిష్టిగా విఫలమవ్వడంతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. కెప్టెన్ లారా వొల్వార్డ్త్(31)ను ఔట్ చేసిన మేగన్ షట్ తొలి వికెట్ అందించగా.. ఫామ్‌లో ఉన్న తంజిమ్ బ్రిట్స్(6)ను కిమ్ గార్త్ పెవిలియన్ చేర్చింది. అక్కడి నుంచి అలనా కింగ్ సఫారీలను దెబ్బకొడుతూ వచ్చింది. తొలుత.. సునే లుస్(6)ను ఔట్ చేసిన తను.. అనెరీ డిర్క్‌సెన్(5), గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ బాదిన మరినే కాప్(0), సినాలో జఫ్తా(29), క్లో ట్రయాన్(0), నడినే డీక్లెర్క్(14), మసబత క్లాస్(4)లను ఔట్ చేసి.. ఏడో వికెట్ సాధించింది. కింగ్ విజంభణతో 24 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అలేనా కింగ్‌కు దక్కింది.

**11 పరుగులకే రెండు వికెట్లు**

ఛేదనలో ఆరంభంలోనే డేంజరస్ ఓపెనర్ ఫొబే లిచ్‌ఫీల్డ్(5)ను ఔట్ చేసి మరినే కాప్ బ్రేకిచ్చింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఎలీసా పెర్రీ(0) డకౌట్ కాగా 11 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. అయితే. సఫారీల ఉత్సాహంపై నీళ్లు చల్లుతూ బేత్ మూనీ(42), జార్జియా వోల్(38 నాటౌట్) దూకుడుగా ఆడారు. బౌండరీలతో విరుచుకుపడిన ఈ ద్వయం మూడో వికెట్‌కు 76 పరుగులు జోడించి జట్టును గెలుపు వాకిట నిలిపారు. అర్ధ శతకానికి చేరువైన మూనీని డీక్లెర్క్ పెవిలియన్ పంపింది. ఆ తర్వాత వచ్చిన అనాబెల్ సథర్‌లాండ్(10 నాటౌట్) సైతం ధనాధన్ ఆడడంతో ఏడు వికెట్ల తేడాతో గెలిచింది.

# వీడిన కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ..!





**కర్నూలు క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ వీడింది. చిన్నటేకూరు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు.బైక్ నడుపుతూ చనిపోయిన శివశంకర్‌తో పాటు ఎర్రిస్వామి అనే వ్యక్తి ఉన్నాడు. చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడై డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా.. ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డాడు. అదే సమయంలో బైక్‌ను కావేరి ట్రావెల్స్ బస్సు వచ్చి ఢీ కొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. ఆ సమయంలో బస్సు కింద మంటలు వచ్చి అంతా వ్యాపించాయి. ఎర్రిస్వామి, శివశంకర్ కలిసి లక్ష్మీపురం నుండి శుక్రవారం తెల్లవారుజాము 2 గంటలకు బయలు దేరారు. ఎర్రిస్వామిని వదలడానికి శివశంకర్ తుగ్గలికి బయలు దేరాడు. దారిలో కియా షోరూం దగ్గర హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో తెల్లవారుజామున 2.24 గంటలకు రూ.300 పెట్రోల్ పోయించుకొని బయలు దేరారు. బయలు దేరిన కొద్దిసేపటికి చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడై డివైడర్‌ను ఢీకొట్టాడు. శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రిస్వామి గాయాలతో బయటపడ్డాడు. ప్రమాద స్థలం దగ్గర రోడ్డు మధ్యలో నుండి శివశంకర్‌ను బయటికి లాగి శ్వాస చూడగా.. అతడు చనిపోయాడని ఎర్రిస్వామి నిర్ధారించుకున్నాడు. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను తీద్దామనుకునే సమయంలోనే కావేరి ట్రావెల్స్ బస్సు దోసుకొచ్చింది. బైక్‌ను బస్సు ఢీకొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్ళింది. బస్సు క్రింద మంటలు రావడంతో ఎర్రిస్వామి బయపడి అక్కడి నుండి తన స్వంత ఊరు తుగ్గలికి వెళ్ళిపోయాడు. ఉలిందకొండ పీఎస్లో కేసు నమోదు చేస్తున్నాం. ఈఘటనపై దర్యాప్తు చేస్తాం' అని ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు.

# గంజాయి ముఠా కోసం పోలీసుల గాలింపు

◆ **పోలీసుల అదుపులో 50 మంది వరకు**

**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** మదనపల్లె పట్టణ, నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున గంజాయి ముఠా ఉన్నట్లు పోలీసులు పసిగట్టారు. ఈనేపథ్యంలో బెంగళూరులో సాఫ్ట్వేర్ గా పనిచేస్తూ గత నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రిలో నక్కలదిన్నె తండాలో బస్సు దిగి, సత్సంగ్ పాఠశాల వద్ద ఉన్న తన ఇంటికి వెళుతుండగా కొంత మంది యువకులు వెంబడించి అతని వద్ద బంగారు చైను, 20వేల నగదు లాక్కొని, కొట్టి దారిదోపిడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో పోలీసులు విచారణ చేపట్టగా ఇది గంజాయి ముఠా పనేనని తేలింది దీంతో మదనపల్లె క్రైమ్ పోలీసులు, ఒకటో పట్టణ, రెండో పట్టణ, తాలూకా, రూరల్ పోలీసులు గంజాయి బ్యాచ్‌ని పట్టుకునే పనిలో తీవ్ర స్థాయిలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సుమారు 50 మంది గంజాయి ముఠా పట్టుబడినట్లు తెలుస్తోంది. వారి వద్ద పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడకపోవడంతో ఎక్కడైనా గంజా యిని దాచారా, ఎక్కడైనా నిల్వలు పెట్టారా, అన్న కోణంలో దర్యాప్తు సాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత పెద్ద ఎత్తున మదనపల్లెలో గంజాయి ముఠా సంచరిస్తూ దారి దోపిడీలకు పాల్పడుతున్నట్లు ప్రచారంలో ఉండడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మదనపల్లిలో నాలుగు పోలీస్ స్టేషన్‌లు, పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది, క్రైమ్‌పార్టీలు, ఇంటిలిజెన్స్, స్పెషల్‌పార్టీబలగాలు ఉన్నప్పటికీ చాప కింద నీరులా పారుతున్న గంజాయిని నిచారించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే కొన్ని రాజకీయ ఒత్తిడుల కారణంగా కొంతమందిని వదిలి పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గంజాయి బ్యాచ్‌లో యువత, విద్యార్థులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చూపుతారో, ఎంత మేర గంజాయిని స్వాధీనం చేసుకుంటారో తెలియాల్సి ఉంది.

## బాధితురాలికి బంగారు చైనును అప్పగించిన సీఐ



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** మదనపల్లె పట్టణంలోని టైటానిక్ ఎగ్జిబిషన్‌లో బంగారు చైను పోగొట్టుకున్న మహిళకు టూటౌన్ సిఐ రాజారెడ్డి చైను ను అప్పగించాడు. కురబలరకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన తరిగొండ శ్రీనివాసులు, ప్రమీల దంపతులు రెండు రోజుల క్రితం పట్డణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో నడుస్తున్న టైటానిక్ ఎగ్జిబిషన్ కు వచ్చారు. రూ.లక్ష విలువ గల సుమారు 10 గ్రాముల బంగారు చైను ను ఎక్సబిషన్ లో ప్రమీల పోగొట్టుకుంది. బాధితురాలు వెంటనే రెండవ పట్టణ సీఐ రాజారెడ్డి కి ఫిర్యాదు చేయడంతో స్పందించిన సిఐ మహిళ జార విడచుకున్న 10 గ్రాముల బంగారు చైను ను ఆ ప్రదేశంలో టెక్నికల్ ఆధారాల ద్వారా బంగారు చైన్ ను సీఐ స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితురాలు తరికొండ ప్రమీలను స్టేషన్ కు పిలిపించి అప్పగించారు. ప్రమీల కుటుంబ సభ్యులు సీఐ రాజారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో స్పందించి బాధితురాలికి న్యాయం చేసిన సిఐ ని పలువురు అభినందించారు.

# కార్యకర్తను ఆదుకున్న కనేకల్ టీడీపీ

**టీడీపీ తరపున రూ.50వేల ఆర్థిక సాయం**


**సయ్యద్ ముర్షద్ పీర్ ఖాద్రి మరో రూ.50వేల ఆర్థిక సాయం**




**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** తెలుగుదేశం పార్టీలో ఎవరికి ఇబ్బంది వచ్చిన ఓ కుటుంబ సభ్యుడిగా ఆదుకోవడానికి పార్టీ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. కనేకల్లు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త సలాం కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. పార్టీ తరపున రూ.50వేల నగదు మరియు జామియా మజీద్ వంశ పార్యం పర్య ముత్వల్లి అయిన సయ్యద్ ముర్షద్ పీర్ ఖాద్రి మరో రూ.50,000 కలిపి రూ. లక్ష ఆ కుటుంబానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. బండల పాలిసింగ్ యూనిట్లో పనిచేస్తూ గాయపడ్డ విషయాన్ని ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దాంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఉద్దేశంతో నేడు నగదు సాయం అందించామన్నారు. తమ భార్య కూడా పనిచేసే పరిస్థితుల్లో లేనందున ఈ సాయం కొంత కాలం పాటు తన కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. సలాం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే చేసిన సాయం పట్ల కృతజ్ఞతలు తెలిపారు తెలుగుదేశం పార్టీలో ఎవరికి ఇబ్బంది వచ్చిన ఆదుకుంటామని ఎమ్మెల్యే కాలవ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లాలేప్ప, మాజీ ఎంపిపి ఫక్రుద్దీన్,సయ్యద్ నెమ్ తుల్ల ఖాద్రీ మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా ఎస్.రెడ్డి షంషీర్

**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం నూతన కార్యవర్గం శనివారం కొలువుదీరింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్నికల అధికారి కే.రాజశేఖర్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్.రెడ్డి షంషీర్, ఉపాధ్యక్షుడిగా ఎన్.రెడ్డెప్ప (రెడ్డి రాయల్), కార్యదర్శిగా బి.మహేష్ కుమార్ (చిన్న మహేష్), సభ్యులుగా చల్లా చలపతి, శివానందర్ నాయక్, నరేష్,శివాజీ రాయల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి షంషీర్ మాట్లాడుతూ శాసనసభ్యులు షాజహాన్ బాషా ఆశీస్సులతో మదనపల్లె సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. ఎమ్మెల్యే సూచనలు, సలహాలతో మదనపల్లె సహకార గృహనిర్మాణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ పదవికి తాను ఎంపిక కావడానికి సహకరించిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో భాగంగా ఎస్.రెడ్డి షంషీరును టిడిపి సీనియర్ నాయకులు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ నాదెళ్ల శివన్న పూలమాల, శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కే.ప్రవీణ్ కుమార్ (పర్సన్ ఇంచార్జి), రోషన్ జమీర్ (డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్),సహకార గృహ నిర్మాణ సంఘం కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.





## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

◆ **సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 25 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈనెల 27వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ ఈనెల 27వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్స్అప్‌లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్‌కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## 26న వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని బస్టాండ్ సర్కిల్ నందు నేడు 26న ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న సందర్భంగా బీసీ సంఘాలు ప్రజలు వడ్డెర కులస్తులు కూటమి నాయకులు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని వడ్డెర సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డే వెంకట్ వడ్డెర సంఘం నాయకులు సహకార సంఘం చైర్మన్ రవి మోహన్ డైరెక్టర్ అమర్ మండల అధ్యక్షులురామాంజనేయులు తదితరులు శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం లో జరిగిన విలేకరుల సమావేశంలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి, కూలర్ పార్లమెంట్ సభ్యులు వడ్డే మల్లేష్ బాబు, మాజీ పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరయ్య, టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, తో పాటు వడ్డెర ప్రముఖులు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై వడ్డే ఓపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిడిమామిడి, మహేంద్ర, సర్పంచ్ వినోద్ కుమార్,శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం





**పామిడి, సూర్య వాస్తవం, అక్టోబర్ 25:** పామిడి పట్టణంలో ఎన్ హెచ్ 44 హైవే రోడ్డు ప్రక్కన వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో 41 రోజు మాల ధరించిన మండల దీక్షను చేసే స్వాములకు కార్తిక మొదటి సోమవారం రోజున అయ్యప్ప మాల ధరించిన స్వాములకు ఆంజనేయ స్వాములకు మాల ధరించిన సాయి హాస్పిటల్ రాజగోపాల్ స్వామి డాక్టర్. సాయికిరణ్ స్వామి.అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్వాములు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854